నవతెలంగాణ
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం 10 మే 2023

కంటి వెలుగును పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-తాడ్వాయి

కామారెడ్డి పట్టణంలోని సందీపని జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న కంటివెలుగు శిబిరాన్ని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం సందర్శించారు. కంటి వెలుగు కేంద్రంలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. అవసరమైన వారికి మందులు, కంటి అద్దాలు ఉచితంగా అందజేయాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి చంద్రశేఖర్, కౌన్సిలర్ వనిత, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- కలెక్టర్‌కు వినతి



నవతెలంగాణ-సదాశివనగర్

పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరుతూ సదాశివనగర్ మండల సర్పంచ్‌ల ఫోరం ఆధ్వర్యంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పెండింగ్ బిల్లుల విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బడాల భాస్కర్‌రెడ్డి, సంగారెడ్డి, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, ముదువు బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యాశాఖ అధికారులకు

లండన్‌లో విందు

- ఘనంగా సన్మానం

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

లండన్ పర్యటనలో ఉన్న తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రికి, తెలంగాణ ఉన్నత విద్యాసెక్రెటరీ కరుణ ఐఏఎస్‌కు ప్రవాస తెలంగాణ వాసులు మంగళవారం తేనేటి విందు ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి బ్రిటన్ తెలంగాణ వాసుల ప్రత్యేక ఆహ్వానం మేరకు విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉన్నత విద్యలో ప్రపంచవ్యాప్తంగా ఎదుర్కొంటున్న సవాళ్లను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య విభాగంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని నిబంధనల ప్రకారం 1988 ఏపీఎస్‌సీహెచ్‌ఈ ఉన్నత విద్యా మండలి స్వీకరణ ద్వారా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీఎస్‌సీహెచ్‌ఈ) ఏర్పాటు చేసిందని అంతేకాకుండా టీఎస్‌సీహెచ్‌ఈ ఉన్నత విద్యా సంస్థలను నియంత్రించడం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత విద్యాసంస్థల సంఖ్యను విస్తరించడంపై ప్రభుత్వం దృష్టి సారించిందని, ఉన్నతవిద్యకోసం పెరుగుతున్న ఆదరణను దృష్టిలో ఉంచుకొని అనేక కొత్త కళాశాలలు, విశ్వవిద్యాలయాలు వృత్తిపరమైన సంస్థలు స్థాపించబడ్డాయని తెలిపారు. డిగ్రీ కాలేజీల్లో డేటా సైన్సెస్‌లో మూడేళ్ల బీఎస్సీ, బిజినెస్ అనలిటిక్స్‌లో బీకామ్ లాంటి కొత్త కోర్సులను ప్రారంభించి గ్రామీణ యువతకు ఉద్యోగ కల్పనలో దోహద పడుతుందని అన్నారు. విద్యార్థుల ఉపాధిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిందన్నారు. ఈ కార్యక్రమాలు విద్యార్థుల్లో పరిశ్రమకు సంబంధించిన నైపుణ్యాలను అందించడం వారి ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచడం లక్ష్యంగా స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించిన రిటైల్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్, ఇ-కామర్స్‌కు సంబంధించిన కోర్సులను రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు చదువుతున్న సమయంలోనే స్టైఫెండ్ అందేలా రూపకల్పన చేస్తున్నామని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు మద్దతుగా తెలంగాణ ప్రభుత్వం వివిధ స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సహాయ పథకాలను అందిస్తుందన్నారు. విద్యా ప్రమాణాలను నిర్వహించడం ఎప్పటికప్పుడు మెరుగుపరచడానికి అక్రిడిటేషన్, మూల్యాంకన పద్ధతులు ఉపయోగంలో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ (టీఎస్‌సీహెచ్‌ఈ) ఇటీవలి పరిశీలన ప్రకారం, తెలంగాణలోని ఆరు రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో పురుషుల కంటే మహిళల సంఖ్య నమోదు అయిందన్నారు. రాష్ట్రంలో ఈ సంవత్సరం ఇంజినీరింగ్, మెడిసిన్ మినహా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులకు చేరిన మహిళల సంఖ్య పురుషులతో పోలిస్తే 14వేలకుపైగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్కాలర్‌షిప్‌లు, రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ వంటి సౌకర్యాల కారణాల వల్ల ఉన్నత విద్యను అభ్యసించే మహిళల సంఖ్య పెరగడానికి కారణ మని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యావ్యవస్థను కేంద్రం ప్రభుత్వం రాష్ట్ర సూచనలను పరిగణలోకి తీసుకోకుండా నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుక రావడం వల్లకొత్త విద్యవిధానంపై పలుసందర్భాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయని ఒక ప్రశ్నకు బదులు తెలిపారు. తెలంగాణ ఎడ్యుకేషన్ సెక్రటరీ కరుణ ఐఏఎస్ మన ఊరు మన బడి కార్యక్రమం నడుస్తున్న తీరును ప్రభుత్వ పాఠశాల మౌలిక సదుపాయాలు అభివృద్ధిని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న 27వేల పాఠశాలలో తొలిదశలో 7000 పాఠశాలలను అన్ని రకాల మౌలిక సదుపాయాలు, అంతర్జాతీయ స్థాయి తగ్గ సదుపాయాలను ఏర్పరుస్తూ తీర్చిదిద్దుతున్న తీరును స్పష్టంచేశారు. హైదరాబాద్ బావర్చి రెస్టారెంట్ ఆతిథ్యాన్ని స్వీకరించినందుకు ప్రవాసులు బావార్చి రెస్టారెంట్ యజమానులు కిశోర్ మున్నాగాల, తెలంగాణ జాగృతి యూరప్ అధ్యక్షులు దన్నంనేని సంపత్ కృష్ణ, ఉస్మానియా అలునిని యూకే యూరప్ ఫౌండర్ ప్రెసిడెంట్ సుధాకర్‌గౌడ్, తెలంగాణ డెవలప్‌మెంట్ పతాకంపై ఫోరం ప్రెసిడెంట్ శ్రవణ్‌గౌడ్, పింగళి శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ న్యాయవాది కమల్ ఓరుగంటి, సురేష్ గోపతి తదితరులు ప్రొఫెసర్ లింబాద్రి, కరుణను ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు.



తేనేటి విందులో పాల్గొన్న లింబాద్రి, కరుణ

డిమాండ్లు సాధించేవరకూ

సమ్మెను విరమించబోం

- వీవోఏల వంటావార్పు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఐకేపీ వీవోఏలు తమ డిమాండ్లను నెరవేర్చాలని చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం కొనసాగింది. అందులో భాగంగా పలుచోట్ల వీవోఏలు వంటావార్పు చేసి నిరసన తెలిపారు.

ఎడపల్లి : మండల కేంద్రంలో వీవోఏలు వంటావార్పు చేపట్టారు. తమ డిమాండ్లను సాధించుకునే వరకు సమ్మెను విరమించబోమని వీవోఏలు స్పష్టం చేశారు. ఏండ్ల తరబడి ఇందులో పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమ కష్టసుఖాలను గుర్తించకపోవడం బాధాకర విషయమని ఎడపల్లి మండల అధ్యక్షులు సుదర్శన్ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగ భద్రతతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని వీవోఏలు డిమాండ్ చేశారు. ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుమ్మరి పుష్ప సుదర్శన్, లక్ష్మణ్, మంజుల, సంధ్యా, కొమురవ్వ, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.



వర్ని : వంటావార్పులో పాల్గొన్న వీవోఏలు

వర్ని : చందూర్, వర్ని మండలాలకు చెందిన ఐకేపీ వీవోఏల సమ్మె 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వీవోఏలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట వంట వార్పుతో సమ్మె చేశారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అమలుపరిచే వరకు సమ్మె కొనసాగిస్తామని మండలాల వీవోఏలు తెలిపారు.

కోటగిరి : మండల కేంద్రంలో ఐకేపీ వీవోఏలు మంగళవారం వంటావార్పు నిర్వహించి ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చాలని నిరసన వ్యక్తం చేశారు. మహిళల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతూ మహిళల సాధికారత కోసం చాలీచాలని జీతాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వీవోఏలు పేర్కొన్నారు.

వీరికి బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాసుల బాలరాజ్ సంఘీభావం తెలిపారు. 16వ రోజు భాగంగా ఐకేపీ వీవోఏలు వంటావార్పు చేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు సరిత, ఉపాధ్యక్షుడు సాయిలు, కార్యదర్శి రమేష్, కోశాధికారి సుమ, సహాయ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

మోరీలు తీసిన మోకన్‌పల్లి సర్పంచ్

నవతెలంగాణ-నవీపేట్

సఫాయి కార్మికులు సమ్మె చేస్తుండడంతో మురుగుకాలువల శుభ్రం చేసేందుకు మంగళవారం తెడ్డు పట్టుకొని మోకన్‌పల్లి సర్పంచ్ మోరీలు తీశారు. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం మోకన్‌పల్లి గ్రామపంచాయతీలో మంగళవారం పుర్రె గంగాధర్ ఇంట్లో శుభకార్యం ఉండడంతో మోరి శుభ్రం లేక మురుగు వాసన వస్తుండడంతో సర్పంచ్ రొడ్డ సుధాకర్‌ను సఫాయి కార్మికులతో శుభ్రం చేయించాలని కోరారు. దీంతో సఫాయి కార్మికుడైన నర్సయ్యను శుభ్రం చేయాలని సర్పంచ్ కోరగా తాము సమ్మెలో ఉన్నామని తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకూ ఎటువంటి పని చేయబోమని ఖరాకండిగా తెలిపాడు. దీంతో గత్యంతరం లేని కారణంగా సర్పంచ్ రొడ్డ సుధాకర్ తెడ్డు, పావుడ పట్టుకొని తానే స్వయంగా గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో గల మోరీని శుభ్రం చేశారు. గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె కారణంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రజలు మురుగు వాసనతో పాటు దోమల బెడదతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్‌లకు బిల్లులు రాక నానా అవస్థలు పడుతుంటే ప్రజలకు కనీస అవసరాలతోపాటు పారిశుద్ధ్య సమస్యను తీర్చలేని పరిస్థితిలో ఆవేదన చెందుతున్నారు. సర్పంచులు ఏమీ చేయలేని దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారనడానికి సర్పంచ్ రొడ్డ సుధాకర్ పరిస్థితే నిదర్శనమని చెప్పకనే చెప్పవచ్చు.



శ్రీ కాలభైరవ స్వామిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు



జ్ఞాపికను అందుకుంటున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని ఈసన్నపల్లి (రామారెడ్డి)లో వెలసిన శ్రీ కాలభైరవ స్వామిని మంగళవారం కామారెడ్డి సివిల్ కోర్టు జడ్జి శ్రీదేవి దంపతులు, అడిషనల్ కలెక్టర్ చంద్రమోహన్ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ పూజారులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ వారికి శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు, స్వామి వారి జ్ఞాపకం అందజేశారు. కార్యక్రమంలో సురేందర్, పూజారులు శ్రీనివాస్ శర్మ, మనీష్ శర్మ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-వర్ని

మండలంలోని సేవాలాల్ తండాకు చెందిన బానోత్ సంతోష్ అనే యువకుడు తన సెల్‌ఫోన్‌ను గత కొద్ది రోజుల క్రితం బడాపహాడ్‌లో పోగొట్టుకున్నాడు. బాధితుడు సంతోష్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీస్ సిబ్బంది సీఈఐఆర్‌తో ఫోన్ లొకేషన్‌ను గుర్తించి స్వీకరించారు. మంగళవారం బాధితుడిని పిలిచి ఫోన్‌ను ఎస్ఐ అనిల్ రెడ్డి అందజేశారు. ఫోనును గుర్తించి బాధితునికి అందజేసిన పోలీస్ సిబ్బందిని ఎస్ఐ అనిల్‌రెడ్డి అభినందించారు.

గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే విశేషకృషి



నవతెలంగాణ-మద్నూర్

తమ గ్రామాభివృద్ధికి జుక్కల్ ఎమ్మెల్యే హనుమంతుషిండే విశేష కృషి చేస్తున్నారని మేనూర్ గ్రామస్తులు తెలిపారు. మంగళవారం ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు వై.గోవింద్ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మద్నూర్ బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ.. మేనూరు గ్రామంలో గల ముదిరాజ్ గంగపుత్ర పద్మశాలి రైతు భవనం అలాగే మేనూర్ నుంచి మధ్యమార్గమైన సుల్తాన్‌పేట్ గ్రామం వరకు రోడ్డు అభివృద్ధి పనులకు గాను మొత్తం రూ.25 లక్షలు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులంతా ఐక్యమత్యంగా పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మందాకిని శ్రీనివాస్‌గౌడ్, మండల పరిషత్ కోఆప్షన్‌మెంబర్ నిజాముద్దీన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోషులు ప్రజల ముందు క్షమాపణ చెప్పక తప్పదు

నవతెలంగాణ-తాడ్వాయి

ఇటీవల కామారెడ్డిలోని వాణి బీడీ యాజమాన్యం తనపై, శ్రమిక శక్తి బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గంపై మోపిన కుట్రకేసును తక్షణమే ఎత్తి వేయాలని కామ్రేడ్ రాజన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుకు సంబంధించిన ప్రాథమిక విచారణ చేపట్టి వాస్తవ దోషులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ని రోజులకైనా దోషులు దొరుకుతారని వారు ప్రజలముందు క్షమాపణ చెప్పక తప్పదని ఈ కుట్ర కేసులో బాధితులు పేర్కొన్నారు.

ఇంటర్‌లో 60 శాతం ఉత్తీర్ణత

- బాలికలదే పైచేయి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2022-23 విద్యా సంవత్సరానికి గానూ నిజామాబాద్ జిల్లాలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 60 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా మొదటి సంవత్సరంలో 58శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీ రఘురాజ్ తెలియజేశారు. రెండవ సంవత్సరం మొత్తం 14,086 మంది విద్యార్థులకు గానూ 8,561 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. వీరిలో బాలురు 6,391 మందికి గానూ 3,284 మంది విద్యార్థులు పాస్ కాగా 51 శాతం మంది బాలురు ఉత్తీర్ణత సాధించారు. బాలికలు 7,695 మంది పరీక్షలకు హాజరు కాగా 5,277 మంది విద్యార్థినిలు పాస్ అయి 68శాతం ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా రెండవ సంవత్సరం విద్యార్థులు ఉత్తీర్ణతలు 15వ ర్యాంకును పొందారు. అలాగే మొదటి సంవత్సరం విద్యార్థులు 15,315 మంది పరీక్షలకు హాజరు కాగా 7,782 మంది విద్యార్థులు ఉత్తీర్ణతతో 51శాతం సాధించి రాష్ట్రంలో 16వ ర్యాంకును పొందారు. వీరిలో బాలురు 7000 మంది పరీక్షలకు హాజరు కాగా 2,966 మంది బాలురు పాసై 42శాతం ఉత్తీర్ణత సాధించారు. కాగా బాలికలు 8,215 మంది పరీక్షలకు హాజరు కాగా 4,816 మంది పాసై 58 శాతం ఉత్తీర్ణత సాధించారు. నిజామాబాద్ జిల్లాలో 2021-22 సంవత్సరం ఫలితాలలో రెండవ సంవత్సర విద్యార్థులు 65శాతం ఉత్తీర్ణత సాధించగా ఈసారి 60 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అలాగే మొదటి సంవత్సరంలో 2021-22 విద్యాసంవత్సరానికి గానూ 58 మంది శాతం ఉత్తీర్ణత సాధించగా ప్రస్తుతం 51 శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా ఇంటర్ విద్య అధికారి శ్రీ రఘురాజ్ మాట్లాడుతూ.. పరీక్షలలో ఫెయిల్ అయిన విద్యార్థులు మానసికంగా కుంగి పోవద్దని, వెంటనే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రిపేర్ కావాలని సూచించారు. విద్యార్థులు మానసికంగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్టయితే వారి తల్లిదండ్రులు కోపగించుకోవద్దని టెలి మానస్‌ను సంప్రదించవచ్చని వారికి కౌన్సెలింగ్ ఇస్తారని తెలియజేశారు. లేదా 14416 టోల్ ఫ్రీ నంబర్ కూడా సంప్రదించవచ్చని జిల్లా ఇంటర్ విద్యాధికారి తెలియజేశారు. పరీక్షల ఫలితాలలో ఏవైనా తప్పులు దొర్లినట్టయితే ఇంటర్మీడియట్ హెల్ప్ డెస్క్‌ను helpdesk-ie@telangana.gov.in సంప్రదించవచ్చని తెలియజేశారు. కాగా విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు పరీక్ష ఫీజులను ఆయా కళాశాలలో చెల్లించాలని తెలియజేశారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 4వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రస్తుతం పరీక్షలలో రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోరుతున్న విద్యార్థులు రీకౌంటింగ్‌కు 100 రూపాయలు, రీకౌంటింగ్, పరీక్ష జవాబు పత్రాల జిరాక్స్ కాపీలను పొందడానికి 600 రూపాయలను ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. ఈ అవకాశం ఈనెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు మాత్రమే ఉంటుందని తెలియజేశారు.

కదం తొక్కిన గ్రామపంచాయతీ సిబ్బంది

నవతెలంగాణ-కోటగిరి/బోధన్

మండల కేంద్రంలో ఉమ్మడి మండలంలోని గ్రామ పంచాయతీ కారోబార్లు, సఫాయి, సిబ్బంది, ఎలక్ట్రీషన్, వాటర్‌మెన్, డ్రైవర్లతో మంగళవారం 5వ రోజు సమ్మెలో భాగంగా టి.జి.కె.ఎస్.యు. రాష్ట్ర పిలుపు మేరకు ఎంపీడీవో ఆఫీస్ నుంచి ర్యాలీగా వెళ్లి బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి సమస్యల పరిష్కారం కొరకు వినతి పత్రాన్ని అందజేశారు. రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌కు తమ సమస్యలను విన్నవించినట్లు అధ్యక్షురాలు వాగ్మారే రాజేశ్వరి పేర్కొన్నారు. చాలీచాలని జీతాలతో పెరుగుతున్న ధరలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రభుత్వం తక్షణమే డిమాండ్లను నెరవేర్చాలని లేనిపక్షంలో ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఆయూబ్, గౌరవ అధ్యక్షులు గాండ్ల చంద్రశేఖర్, కార్యదర్శి పాలడుగు రజిని, కార్యవర్గసభ్యులు హనుమాండ్లు, జాకీర్, బాలు, పోతంగల్ నగేష్, సాయగౌడ్, శంకర్, అయూబ్, రవీంద్రనాథ్, లలిత, రమేష్, సుధాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. వీరికి మద్దతుగా బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కాసుల బాలరాజు సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ శంకర్, కాంగ్రెస్ నాయకులు గంగాధర్ దేశాయ్, మనోహర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన..

పంచాయతీ కార్మికుల ర్యాలీ..

బోధన్ : తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గ్రామపంచాయతీ కార్మికులు మంగళవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించి మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం పంచాయతీ కారోబార్లను మల్టీపర్పస్ విధానం నుంచి విముక్తి కల్పించాలని అన్నారు. కారోబార్లకు కనీస వేతనం రూ.21,500, పంచాయతీ సిబ్బందికి కనీస వేతనం రూ.15,500 మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోశెట్టి, శరత్, మరయ్య, సక్కుబాయి, శంకర్, రాములు, లింగం తదితరులు పాల్గొన్నారు.

ముస్తాపూర్‌లో కంటి వెలుగు ప్రారంభం

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ముస్తాపూర్ గ్రామంలో మంగళవారం ఉదయం 10 గంటలకు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆదేశాల మేరకు గ్రామంలో సర్పంచ్ మమత వివేకానంద కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రతిక్షణం పేద ప్రజల కోసం ఆలోచిస్తూ వారికి అవసరమయ్యే సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని అందులో ఒకటి కంటి వెలుగు అని పేర్కొన్నారు. ఈ పథకం ముఖ్య ఉద్దేశం మారుమూల గ్రామాలకు ప్రజలకు కంటి వైద్య సేవలు అందించాలనేదే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మణ్‌గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ సిద్ధారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు బండి రాజయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దివిటి రమేష్, గ్రామ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు నెల్లూరి గంగారం, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఫతియొద్దిన్, భీమ్‌రావు, సీనియర్ నాయకులు నరహరి, రాజారెడ్డి, సాదిక్, వడ్ల రవి, బిట్ల కృష్ణ, డాక్టర్లు అమిత, శ్రీరామ్, బాలాజీ, ఏఎన్ఎం రాజమణి, ఆశాలు స్వరూప, రాణి, అంగన్వాడీ అంజవ్వ, వీఆర్ఏలు సాయికుమార్, సాయిలు, కారోబార్ నరేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



ప్రారంభమైన కంటివెలుగు

రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాలుడు మృతి

- బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించిన బంధువులు
- బాధిత కుటుంబానికి ఆదుకుంటామన్న ఎమ్మెల్యే



ఆందోళన చేస్తున్న బాధితులు

నవతెలంగాణ-బోధన్

గత ఆదివారం బోధన్ పట్టణ శివారులోని మర్రి మైసమ్మ ఆలయ సమీపంలో గల ఫంక్షన్‌హాల్‌లో బోధన్ తట్టికోట ప్రాంతానికి చెందిన బాలుడు దీపక్ తేజ (11) తల్లిదండ్రులతో కలిసి వారి బంధువుల పెళ్ళికి వెళ్లిన బాలుడిని ఎమ్మెల్యే అనుచరుల కారు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. దాంతో స్థానికులు బాలుడిని బోధన్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ తరలించిన పిదప చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందారు. ఒడ్డెన్న, రాధ దంపతులకు పెళ్లయిన పదేళ్లకు పుట్టిన బిడ్డ ఇలా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి. అయితే ప్రమాదంలో మృతి చెందిన బాలుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ మంగళవారం మృతుని బంధువులు బోధన్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. సమాచారం అందుకున్న పట్టణ సీఐ ప్రేమ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. దాంతో బాధిత వర్గ పెద్దలు ఎమ్మెల్యే షకీల్ ఆమేర్‌తో ఫోన్‌లో సంప్రదింపులు జరిపి వారిని ఆదుకోవాలని కోరారు. దాంతో ఆయన సంఘ పెద్దలతో ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబానికి 6 లక్షల రూపాయల ఆర్థిక సహాయం, డబుల్ బెడ్ రూం ఇల్లు, ఒకరికి ఉద్యోగం ఇప్పించి ఆదుకుంటామని హామీ ఇచ్చినట్టు సంఘం నాయకులు పేర్కొన్నారు. అనంతరం బోధన్ జిల్లా ఆసుపత్రిలో బాలుడి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. ఈ ఘటనపై పట్టణ సీఐ ప్రేమ్ కుమార్‌ను వివరణ కోరగా ఘటనకు సంబంధించి సీసీ కెమెరాలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారును స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

అలరించిన కుస్తీ పోటీలు



నవతెలంగాణ-పిట్లం

మండలంలోని అల్లాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు అలరించాయి. ఉదయం నుంచి పది రూపాయలతో ప్రారంభించిన చిన్నారుల కుస్తీ పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మండలంలోని పలు గ్రామాల మల్ల యోధులు భారీ సంఖ్యలో చేరుకొని ప్రత్యర్థులను చిత్తుచేసి నగదు పారితోషకాన్ని అందుకుని సంతోషం వ్యక్తం చేశారు. ఆఖరి కుస్తీకి గానూ గెలుపొందిన మల్ల యోధునికి 4 వేల రూపాయల నగదు పారితోషకం సర్పంచ్ నారాయణరెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

మనస్థాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- పట్టణంలో విషాదఛాయలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి ప్రజ్వల్ (17) మంగళవారం వెలువడిన ఇంటర్ ఫలితాల్లో ఫెయిల్ అయ్యానని ఇంట్లో మనస్థాపంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

వివరాలు మెయిన్‌లో..

ఉత్తమ ఫలితాలు సాధించిన కామధేను కళాశాల విద్యార్థినులు

నవతెలంగాణ-సిరికొండ



మండల కేంద్రంలోని కామధేను జూనియర్ కళాశాల విద్యార్థినులు ఇంటర్ ద్వితీయసంవత్సరం ఎంపిసి విభాగంలో బోడ రాఘవి 968, బిపిసి లో అన్నారం కావేరి 933, సీఈసీలో ఎర్రోళ్ల ఆరాధన 881, ప్రథమ సంవత్సరంలో మల్కి వైష్ణవి 399తో మార్కులు సాధించారని కరస్పాండెంట్ బాశెట్టి లింబాద్రి తెలిపారు. విద్యార్థినులను ప్రిన్సిపాల్ లక్ష్మీ నర్సయ్య సిబ్బంది అభినందించారు.

పిడుగుపాటుకు 48 గొర్రెలు మృత్యువాత

నవతెలంగాణ-భీమ్‌గల్

భీంగల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన కుర్మ అనిల్‌కు చెందిన 48 గొర్రెలు మంగళవారం పిడుగుపాటుకు మృతి చెందాయి. మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం వచ్చింది. పల్లికొండ, బాచన్పల్లి శివారులో గొర్రెలు మేపేందుకు యజమాని వెళ్ళాడు. ఈ క్రమంలో పిడుగుపాటుకు కుర్మ అనిల్‌కు చెందిన 48 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీధర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. సంఘటన వివరాలు తెలుసుకుని ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. గొర్రెల యజమాని కుర్మ అనిల్ కు గాయాలు కాగా భీంగల్ లోని ప్రైవేట్ ఆసుపత్రి కి తరలించారు. ప్రాణాపాయం ఏమిలేదని వైద్యులు తెలిపారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తొలగిస్తానడం సరికాదు : డిటిఎఫ్

నవతెలంగాణ-ఆర్మూర్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తొలగిస్తామనడం సరికాదుని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బాలయ్య ప్రధాన కార్యదర్శి రాజన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తమ న్యాయమైన డిమాండ్ల కోసంగత 12 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోని ప్రభుత్వం వెంటనే విధుల్లో చేరకుంటే ఉద్యోగం నుండితొలగిస్తామనడం అప్రజా స్వామికమని, ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. పోటీ పరీక్షల ద్వారా ఎంపికైన వారిని ఉద్యోగంలోకి తీసుకునే ముందు సంఘాలలో చేరకూడదని, సమ్మెలు చేయమని హామీ తీసుకోవడం, రెగ్యులర్ చేయమని అడగకూడదని షరతులతో నియమించడం ప్రభుత్వ ప్రజాస్వామిక వైఖరిని స్పష్టం చేస్తుందని తెలిపారు. నియామకమై నాలుగు సంవత్సరాలైనా రెగ్యులర్ చేయకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.

నారాయణ నిజామాబాద్ విజయభేరి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్మీడియట్-2023 ఫలితాలలో నిజామాబాద్ నారాయణ జూనియర్ కాలేజ్ విద్యార్థి జూనియర్ ఇంటర్‌లో 467 మార్కులతో శివరాశి కీర్తన రాష్ట్ర స్థాయిలో రెండోస్థానం పొంది నిజామాబాద్ జిల్లా ఫస్ట్ ర్యాంకు సాధించిందని ప్రిన్సిపల్ కుంట లక్ష్మారెడ్డి ఏజీఎం సదాశివరావు, కోర్ డీన్ యుని ప్రసాద్, జీఎమ్ శ్రీనివాస్ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఏజీఎం సదాశివరావు అండ్ ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. నిజామాబాద్ లో ఇంటర్ విద్యలో స్థాపించిన మొదటి సంవత్సరం లోనే జిల్లా మొదటి ర్యాంకు అండ్ రాష్ట్రస్థాయి రెండో ర్యాంక్ రాష్ట్ర స్థాయిలో 2వ అత్యధిక మార్కు 467, అలాగే 466 ఓ అపూర్వ హర్షిని, లక్ష్మి ప్రసన్న, సుశ్రీజ 463మార్కులు సాధించారన్నారు. మర్రి హర్ష హరికృష్ణ 464, లికిత్ 463, శ్రీనిత్ రెడ్డి, రస్మిత, స్ఫూర్తి 462 మార్కులు, అన్వేష్ నాయక్ 461, సోహన్ 460 సాధించడం నిజామాబాద్‌లో కొత్త శకానికి నాంది పలుకుతునట్ల య్యిందన్నారు. జూనియర్ ఎంపీసీ విభాగంలోలో 470 కి 460 పైన మార్కులు 13 మంది సాదించారని చెప్పారు. 466కు పైగా మార్కులు నలుగురు, 470 కి 450 పైన మార్కులు 24 మంది సాదించారని తెలిపారు. 400పైగా విద్యార్థులకు 60శాతం మార్కులు కలిపి 100శాతం ఉత్తీర్ణత కావడం నారాయణ కళాశాల ప్రతిభన్నారు. జూనియర్ బైపీసీలో 440 మార్కులకు గాను 432 బెస్ట్ మార్కులతో మలిపటల్ ఈషా, 427 మార్కులతో కిరణ్మయి, 399 తనుష్ సాధించడం గర్వకారణమన్నారు. ఐఐటీ నీట్ జేఈఈ ఎంసెట్‌లోనూ అల్ ఇండియా ర్యాంకులు సాధిస్తామని తెలిపారు.సహకరించిన అధ్యాపకులు తల్లిదండ్రులకు విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.



అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

రామన్నపేట్ విద్యార్థినికి ఉత్తమ మార్కులు

నవతెలంగాణ-వేల్పూర్



తల్లిదండ్రులను సన్మానిస్తున్న యాజమాన్యం

మంగళ వారం ప్రకటించిన సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఆర్మూర్ లో క్షత్రియ జూనియర్ కళాశాలలో చదువుతున్న రామన్నపేట గ్రామానికి సంగేపు అభినయ ఎంపీసీ లో 987 మార్కులు సాధించింది. ఆమె ఉత్తమ మార్కులు సాధించటం పట్ల కళాశాల యాజమాన్యం వారి తల్లిదండ్రులను ఆమెను అభినందించి ఘనంగా సన్మానించారు పలువురు గ్రామస్తులు అభినందించారు

రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన మోడల్ కళాశాల విద్యార్థులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండల కేంద్రంలోని మోడల్ జూనియర్ కాలేజీలో చదువుతున్న ఇంటర్మీడియట్ విద్యార్థినిలు రాష్ట్రస్థాయి మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రకటించిన ఇంటర్మీడియట్ మొదటి, రెండవ సంవత్సరం ఫలితాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో 52 శాతం ఫలితాలు సాధించారని. మొదటి సంవత్సరంలో 43 శాతం ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ రాజేష్ రెడ్డి తెలిపారు. ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరంలో ఎంపీసీ విద్యార్థి జీ.మనిదీపిక 964/1000 మార్కులతో, బైపిసిలో అంబటి శశ్రీ 974/1000మార్కులతో, సీఈసీ లో మానస 829/1000 మార్కులతో, ఎంఈసి లో ఇ. గాయత్రి 909/1000 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో మనోజ్ఞ 425/470 మార్కులతో, బైపిసిలో బి.ఇంద్రజ 369/440, సీఈసిలో ఇ. శ్రావణి 433/500 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు. మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను పాఠశాల ప్రిన్సిపల్ రాజేష్ రెడ్డి అభినందించారు.

ఇంటర్ ఫలితాలలో విక్టరీ విజయ కేతనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఇంటర్ ఫలితాలలో విక్టరీ జూనియర్ కాలేజ్ అద్వితీయ ఫలితాలను సాధించింది మొదటి రెండవ సంవత్సర ఫలితాలు అన్నింటిలోనూ రాష్ట్రస్థాయిలో అనేక ర్యాంకులు సాధించింది ఎంపిసి సెకండియర్ ఫలితాలలో ఆరేపల్లి దీక్షిత 992 మార్కులతో జిల్లా మొదటి ర్యాంకు రాష్ట్ర థర్డ్ ర్యాంక్ సాధించింది. బైపీసీ సెకండియర్ ఫలితాలలో సిహెచ్ నిషిత రెడ్డి 989 మార్కులతో రాష్ట్ర ర్యాంకు సాధించింది. ఎంపిసి ఫస్ట్ ఇయర్ ఫలితాలలో బి స్పందన 465 మార్కులతో స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించింది. బైపిసి ఫస్టియర్ ఫలితాలలో డి. సౌమ్య 434 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించింది. సన్మాన కార్యక్రమంలో చైర్మన్ మధుసూదన్ జోషి, డైరెక్టర్లు గజానన్, సంతోష్ ,కార్తీక్ లు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన ఎస్‌ఎస్‌ఆర్ విద్యార్థులు

అభినందించిన కళాశాల యాజమాన్యం

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఎస్ఎస్ఆర్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించారని ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల అధినేత మారయ్య గౌడ్, హరిత గౌడ్ మంగళవారం తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీలో బి. అమరపాలి 970, బి. గౌతమి 947, సి.హెచ్. సృజన 937 మార్కులు సాధించారు. ఎంపీసీలో యం. అక్షయ 910, మహమ్మద్ షేయిస్ ఖాన్ 431, జి. హర్షిత 420 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో బి. రాజేశ్వరి-బైపిసి 890, ఎపీసీలో బి. జైత్రామ్ 864, ఎం. స్ఫూర్తి 853, పి. శ్రీవాణి 832 మార్కులు సాధించారు. విద్యార్థులను ఎస్.ఎస్.ఆర్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ యం. మారయ్య గౌడ్, కరస్పాండెంట్ యం. హరిత గౌడ్ అభినందించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు తమ సంస్థ ఎల్లప్పుడు ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ ర్యాంకులకు కారణమైన అధ్యాపక బృందానికి, విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ యం. రవీంధర్ గౌడ్, సిబ్బంది. విద్యార్థులను ఘనంగా సత్కరించారు.

సత్తా చాటిన ధర్మారం గురుకులం

సెకండ్ ఇయర్ వందశాతం, ఫస్ట్ ఇయర్ 95శాతం ఉత్తీర్ణత



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండలంలోని ధర్మారం (బి) తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ బి సంగీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ సెకండ్ ఇయర్ లో 100శాతం, ఫస్ట్ ఇయర్‌లో 95శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్‌లో 74మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 74 పాస్ అయ్యారు. మొదటి సంవత్సరం 79 విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 75 పాస్ అయ్యారు. ఇంటర్ సెకండ్ ఇయర్ బై పి సి లో బి సింధు 986, యస్ సావిత్రి, బి. సాయి పవన 982 , సెకండ్ ఇయర్ యం పి సి లో, యన్ కీర్తన, కే సిరివెన్నెల 984 , జి నీహారిక , ఏ దివిజ, బి సాయి చరణ్య 981 సాధించారు. జూనియర్ యంపిసిలో బి జయశ్రీ, పి అభినయ, వై సంధ్య 463 , బి వర్ష 462 జూనియర్ బైపిసిలో నందిని 433, స్రవంతి 432 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం అభినందించారు.

ఇంటర్‌లో ఎస్‌ఆర్ విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ


సీనియర్, జూనియర్ ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని ఎస్ఆర్ విద్యార్థులు సత్తా చాటారని జోనల్ ఇంచార్జి గోవర్ధన్ రెడ్డి తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల ఆవరణలో సత్కరించారు. ఎంపీసీ విభాగంలో సీనియర్ ఇంటర్ లో ముత్యాల రిషిత, చెన్నబోయిన శ్రావణిలు 991 మార్కులతో టాపర్‌గా నిలిచారన్నారు. బొబ్బిలి నేహా, రత్నగిరి భవిష్య 990 మార్కులతో 2వ స్థానంలో, 980 మార్కులతో 65 మంది విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారన్నారు. బైపీసీలో సీనియర్ ఇంటర్ లో సూర్యవంశీ, శిరీష లు 990 మార్కులు సాధించారన్నారు. 980కి పైగా మార్కులు 21 మంది విద్యార్థులు సాధించారన్నారు. జూనియర్ ఇంటర్ లో ఎంపీసీ విభాగంలో నేహా, అక్షయ 467 మార్కులతో కాలేజి టాపర్ లుగా నిలిచారన్నారు. 467 మార్కులతో కాలేజి టాపర్ లు శ్రీవర్ష, సాయి వర్షిణి, శ్రీను, శ్రీహిత, షారూన్, రిషితలు 465 మార్కులు సాధించారన్నారు. వర్షిణి, అన్వరుల్లా, సమీర్ ఫిర్దోస్, హర్షిత్, రాకేష్ గౌడ్, సౌమ్య, శ్రీజలు 460 పైగా మార్కులు సాధించారన్నారు. మరో 94 మందికి అత్యుత్తమ మార్కులు వచ్చాయని తెలిపారు. జూనియర్ ఇంటర్ బైపీసీలో అర్చన, జ్ఞానేశ్వర్ లు 436 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారన్నారు. వారందరినీ సన్మానించి సత్కరించారు.



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

ఇంటర్‌లో 88శాతం మార్కులతో మోడల్ విద్యార్థులు

నవతెలంగాణ-ధర్పల్లి



ఇంటర్ ఫలితాలలో మండలకేంద్రములోని ఆదర్శ కళాశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరం లో 88శాతం ప్రథమ సంవత్సరంలో 51శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపల్ రాజేంద్ర సాహు తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీలో నాయిడి రచన 446, బైపీసిలో రాజశ్రీ421, సిఈసీలో మాధురి 354 మార్కులు సాధించారని తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో దేవిశ్రీ 983, బైపిసిలో సానియా 971, ఎంఈసీలో ఇందు 938, సీఈసీలో స్నేహిత 886 సాధించారు. వీరిని కళాశాల అధ్యాపక బృందం ఎస్ఎంసీ, పీటీఏ సభ్యులు అభినందించారు.

16వరోజు వంటావార్పు

నవతెలంగాణ-సిరికొండ

ఐకేపీ వీవోఏల నిరవధిక సమ్మెలో భాగంగా మంగళవారం 16వ రోజు వివోఏలు వంటావార్పు కార్యక్రమం నిర్వహించారు ముఖ్యమంత్రికి తమ గోడు వినిపించడం లేదా.. ఇకనైనా మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి 18 వేల గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు మూన్‌సింగ్, సున్నపు స్వామి,రామ్ చందర్, నాగరాజ్, సునీత, మండల మహిళా సమాఖ్య మండల అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి పాల్గొన్నారు.

క్షత్రియ, సీవీఆర్ విద్యార్థుల విజయ దుందుభి

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని క్షత్రియ జూనియర్ కళాశాల సివి రామన్ జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాలలో సత్తా చాటారు. క్షత్రియ జూనియర్ కళాశాల సీనియర్ ఎంపీసీ 987 మార్కులతో అభినయ, శ్రీ నిలయ, నందిని, చందన, మహతి ర్యాంకులు సాధించారు. బైపీసీలో షర్మిల ,సంపాదిత, రామ్ సా కోరిన్, సిద్రాహరిన్, ధనశ్రీ అత్యధిక మార్కులు సాధించారు. సీఈసీ లో నికిత కుమారి అత్యధిక మార్కులతో సత్తా చాటారు .ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీలో నేహా సునయన, బైపీసీలో అమీనా అనం, హరిణి శర్మ అశ్విని, ఎంఇసి లో రాఖీ, సీఈసి లో స్వామి, సుల్తాన ర్యాంకులు సాధించారు ..ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం అల్జాపూర్ శ్రీనివాస్, అల్జాపూర్ గంగాధర్ ,అల్జాపూర్ దేవేందర్ అధ్యాపక బృందం అభినందించారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన క్షత్రియ విద్యార్థులు

సత్తా చాటిన సివి రామన్...

ఇంటర్ ఫలితాలలో సివి రామన్ జూనియర్ కాలేజ్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులతో విజయదుందిబి మోగించారు. కార్పొరేట్ కాలేజీలకు దీటుగా విద్యార్థులు అధిక శాతంలో పాసైనారు. ఈ ఫలితాలలో సీనియర్ ఎంపీసీ విభాగంలో కే. రాగిణి 974, ఎస్. సింధుజ 949, సీనియర్ బైపిసిలో ఎస్. సాయికిరణ్ 954, ఆర్.వనిత 934, యశశ్రీ 924మార్కులు సాధించారు. జూనియర్ ఎంపీసీ విభాగంలో కే. మేఘన 434, జూనియర్ బైపీసీ విభాగంలో టి. వర్ష 414 సాధించారు. విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ కొట్టూరు గిరిరాజ్ ప్రిన్సిపల్ జాకీర్ హుస్సేన్ అధ్యాపక బృందం అభినందించారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీ భాషిత విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



మండల కేంద్రంలోని శ్రీ భాషిత జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 93శాతం, మొదటి సంవత్సరం ఫలితాల్లో 85శాతం ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో ఉప్లూర్‌కు చెందిన నాలుగు రుచితకు 960 మార్కులు, ఉప్లూర్‌కే చెందిన పోల్కం మేఘన 936 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో బషీరాబాద్‌కు చెందిన ఆకుల శ్రీనిజ 470 మార్కులు, కమ్మర్‌పల్లికి చెందిన నూకల మనోజ్ 408 మార్కులతో టాపర్లుగా నిలిచారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమన్య బృందం సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ పూట్నూర్ రాజశేఖర్, డైరెక్టర్లు సుంకేట రవి, సంజీవ్, సంతోష్, వేణుగోపాల్, లెక్చరర్స్ హన్మండ్లు, గజనంద్, సుమన్, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్ ఫలితాల్లో కేజీబీవీ ప్రతిభ

నవతెలంగాణ-మాక్లూర్



మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం కళాశాల విద్యార్థినిలు మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా కళాశాల ప్రత్యేక అధికారిణి ప్రగతి మాట్లాడుతూ రెండవ సంవత్సరం ఎంపిసిలో సీచ్ నందిత 972 మార్కులు సాధించగా బిపిసిలో నవీన 975 మార్కులు సాధించారని తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపిసిలో కే. రచన 436, సిచ్. స్వాతి 389 మార్కులు సాధించారని తెలిపారు. రెండువ సంవత్సరంలో 62 మంది విద్యార్థినిలు పరీక్ష రాయగా 62 మంది పాసై 100శాతం ఉత్తీర్ణత సాధించారని అన్నారు. . మొదటి సంవత్సరంలో 61 మంది విద్యార్థినిలు పరీక్ష వాయగా 56 మంది పోసై 90శృతం. ఉత్తీర్ణత సాధించారు.

కంటి వెలుగు నిరుపేదలకు వరం

సర్పంచ్ ప్రవీన్ కుమార్

నవతెలంగాణ-భీంగల్

కంటి సమస్యలను దూరం చేసేందుకు సీఎం కేసీఆర్ కంటి వెలుగును ప్రవేశపెట్టారని , ఇది నిరుపేదలకు వరం లాంటిదని పిప్రి సర్పంచ్ ప్రవీన్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని పిప్రి గ్రామంలో కంటివెలుగును సర్పంచ్ ప్రవీన్‌కుమార్, యంపిటీసి అరిగెల సరిత, ఉపసర్పంచ్ రవీంధర్ ప్రారంబించారు. ప్రతి గ్రామంలో శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా అద్దాలు అందజేస్తున్నారని తెలిపారు. కార్యమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ముచ్కూర్ సొసైటీ చైర్మన్ వెంకటేష్, తదితరులున్నారు.

ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల ప్రభంజనం

ఎంపిసిలో మూత అమూల్య సత్త



నవతెలంగాణ-భీంగల్

ఇంటర్ పలితాలలో పట్టణకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రభంజనం కొనసాగింది. ఇంటర్మీడియట్ యంపిసి విభాగంలో భీంగల్‌కు చెందిన మూత అమూల్య అనే విద్యార్థినికి 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించి సత్తా చాటింది. బైపీసీలో ఎన్ సౌమ్య 1000 మార్కులకు గాను 989 మార్కులు సాధించింది. మల్క తనుశ్రీ బైపీసీలో 1000 మార్కులకు గాను 923 మార్కులు సాధించింది. కళాశాల ప్రిన్సిపాల్ అబ్బ చిరంజీవి, లెక్చరర్లు విద్యార్థులను ప్రశంసించారు.

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డిపియం

నవతెలంగాణ-భీంగల్



మండలంలోని దేవన్‌పల్లి, కారేపల్లి, తాళ్లపల్లి, దేవక్కపేట్ గ్రామలలో ఐకెపి ద్వారా నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను డిపియం సాయిలు మంగళవారం పరిశీలించారు. కేంద్రాలలో తూకం త్వరితగతంగా చేపట్టాలని అలాగే తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్‌లకు పంపించాలని నిర్వహకులకు సూచించారు. గన్నీ లారీలు, గన్నీ బ్యాగుల కొరత లేకుండా చూడాలన్నారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఈయన వెంట ఏపియం కుంట శ్రీనివాస్, సిసిలు నరేష్, గంగసాయిలు,దేవక్కపేట్ సర్పంచ్ అనిల్, టీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ తదితరులున్నారు.

పిడుగుపాటుకు గేదె మృత్యువాత

నవతెలంగాణ-రామారెడ్డి

పిడుగుపాటుకు గేదె మృత్యువాతపడింది. ఈ ఘటన మండలంలోని పోసానిపేటలో మంగళవారం చోటుచేసుకుంది. బైఖరి రాజయ్యకు చెందిన రూ.50వేల విలువ గల గేదే సాయంత్రం పిడుగుపాటుకు మృతి చెందింది. పాడి రైతును ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబం కోరుతోంది.


మృత్యువాతపడిన గేదె

1962 వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-దోమకొండ

గొర్రెలు మేకలు పశువుల పెంపకందారులు 1962 సంచార వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యుడు తీగల తిరుమల్‌గౌడ్ అన్నారు. మంగళవారం దోమకొండ మండల కేంద్రంలో 1962 సంచార వైద్య సేవల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గొర్రెలు, మేకలు, పశువుల పెంపకం దారుల కోసం ప్రభుత్వం 1962కు డయల్ చేసి వైద్య సేవలను పొందాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లోని పశువుల పెంపకందారులు సంచార పశువైద్య సేవలను వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లవు అంజలి శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ నాగరాజురెడ్డి, ఎంపీటీసీ నిమ్మ శంకర్, ఉప సర్పంచ్ గజవాడ శ్రీకాంత్, వైద్యుడు సాయికుమార్, కెప్టెన్ అహ్మద్, హెల్పర్ మహమూద్, బీఆర్ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు హసన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం


ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గిద్ద గ్రామానికి చెందిన మళ్లీ విడత తెలంగాణ ఉద్యమకారుడు పెనుకుల పరువయ్య అనారోగ్యంతో గత కొద్ది రోజుల క్రితం మృతి చెందగా, మంగళవారం బాధిత కుటుంబాన్ని పలువురు పరామర్శించారు. సాయినేని ట్రస్ట్ నిర్వాహకులు, సత్యం రావు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి అండగా ఉంటుందని ఎంపీపీ దశరథ్ రెడ్డి తో పాటు పలువురు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ అధ్యక్షులు రంగు రవీందర్ గౌడ్, సింగిల్ విండో చైర్మన్ సదాశివరెడ్డి, నాయకులు సతీష్ గుప్తా, రాజేందర్ రెడ్డి, పడగల రాజేశ్వరరావు, కిరణ్ రెడ్డి, పుండరీకం తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-తాడ్వాయి

సొసైటీ పరిధిలోని కృష్ణాజివాడి, బ్రాహ్మణపల్లి, ఎర్రపహాడ్, సోమారం, ఇంద్రియల్ గ్రామాలలో వడ్ల, మక్కల కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. రైతులు తమ వడ్లను, మక్కలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని, దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కపిల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, రైతుబంధు మండలాధ్యక్షులు, భారత రాష్ట్ర సమితి మండల అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సొసైటీ డైరెక్టర్లు, సొసైటీ వైస్‌చైర్మన్, ఆయా గ్రామ సర్పంచ్‌లు, కృష్ణాజివాడి సర్పంచ్ జంగం భూషణం, ఉపసర్పంచ్ షేర్ బద్దం తిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ, ఉప సర్పంచ్‌లు, రైతులు, స్థానిక నాయకులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వెంటనే పూర్తి చేయాలి

నవతెలంగాణ-పిట్లం

మహిళ గ్రూప్ సభ్యులు ఆన్‌లైన్ వివరాలు వెంటనే పూర్తి చేయాలని జిల్లా డీఆర్డీఏ పీడీ సాయన్న ఐకేపీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మహిళ గ్రూపుల వివరాలను లోకోస్ యాప్‌లో ఆన్‌లైన్ చేయాలని, బ్యాంకు లింకేజీ వివరాలతో పాటు ఎంటర్ప్రైజెస్ వివరాలను అప్డేట్ గా పొందుపరచాలని ఆయన సూచించారు. ముందుగా హస్నాపూర్ గ్రామ పంచాయితీ నర్సరీని పరిశీలించారు. అనంతరం రాంపూర్ గ్రామంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీవో శివ, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం శిరీష సిబ్బంది పాల్గొన్నారు.

ఎడపల్లి మండలంలో గాలి దుమారం

- మంగల్‌పాడ్‌లో 6 గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండలంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు గాలిదుమారం రేగింది. ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి, తానాకలాన్, గ్రామా రెవెన్యూ శివారులో స్వల్ప వర్షం పడడం వలన రైతులు ధాన్యం రాశులపై పట్టాలు కప్పారు. ఇదిలా ఉండగా ఎడపల్లి గ్రామంలోని మంగల్‌పాడ్ గ్రామంలో ఐకేపీ ద్వారా కొనుగోలు కేంద్రం కొనసాగుతోంది. ఈదురుగాలులకు చెట్లకొమ్మలు లెవెన్ కేవీ విద్యుత్ వైర్లకు చిక్కుకు పోయాయి. సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ శాఖ సిబ్బంది ఎల్‌సీ తీసుకొని లారీని పంపే ఏర్పాట్లు చేయడానికి పడరాని పాట్లు పడ్డారు. చుట్టుకొని ధాన్యం లారీకి విద్యుత్ వైర్లతో పాటు చెట్టుకొమ్మలు తగలకుండా ఎలాంటి ప్రమాదం జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. దీంతో గ్రామంలో సుమారు నాలుగు గంటల పాటు విద్యుత్ అంతరాయం కలిగింది.

సబ్ స్టేషన్ మంజూరు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కాటేపల్లి గ్రామానికి 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు అయినట్టు బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు విజయ్ దేశాయి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో తమ గ్రామానికి విద్యుత్ సరఫరాలో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నామని జుక్కల్ శాసన సభ్యులు హన్మంత్ షిండే దృష్టికి తీసుకెళ్లామని దీంతో స్పందించిన ఎమ్మెల్యే తమ గ్రామానికి విద్యుత్ సరఫరా సమస్యను దూరం చేయడానికి సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేశారని ఆయన తెలిపారు. దీనికి కాటేపల్లి గ్రామప్రజలు ఎమ్మెల్యేకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

పంచాయతీరాజ్ ఉద్యోగులకు మద్దతు తెలిపిన తెలంగాణ జన సమితి

నవతెలంగాణ-తాడ్వాయి

జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని శాంతియుతంగా నిరసన చేస్తున్న పంచాయతీరాజ్ ఉద్యోగులకు తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో మంగళవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిజ్జన రమేష్, జిల్లా కన్వీనర్ కుంభాల లక్ష్మణ యాదవ్ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలు ఒప్పందం ప్రకారం విధులు నిర్వహించిన తర్వాత వీరందరినీ శాశ్వత ఉద్యోగంగా పరిగణిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులకు లభించే సౌకర్యాలు లభిస్తాయని చెప్పి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి ఆర్థిక భరోసా గానీ, ఉద్యోగ భద్రత గానీ కల్పించకపోవడం చాలా బాధాకరం అన్నారు. ఉద్యోగం చేస్తున్న సందర్భంలో చనిపోయిన వారు వారి కుటుంబాలు ఇప్పుడు దిక్కుతోచని దీన పరిస్థితులు ఉన్నాయన్నారు.

58, 59 జీవోలో లోపాలను సరి చేయాలి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

నవతెలంగాణ-తాడ్వాయి

58, 59 జీవోలో లోపాలను సరిచేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో 58, 59 జీవోలో ఉన్న లోపాలను సరి చేయాలని అదనపు కలెక్టర్‌కు అందజేశామని, ఆయన స్పందించి ఇది ప్రభుత్వానికి పంపిస్తామని అన్నారు. ఒకపక్క తెలంగాణ ప్రభుత్వం 58, 59 జీవో ప్రకారం ఇండ్లు, ఇండ్ల స్థలాలను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్తూనే జిల్లాలో 2008లో ఇండ్ల స్థలాలు ఇచ్చి వాటిలో ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న వారికి మీసేవ సెంటర్లో ఇంటి పన్ను, కరెంట్ బిల్లు, హౌస్ నెంబర్ అడుగుతున్నారని, ఈ సాకులతో ఆన్లైన్ కాకుండా పరోక్షంగా ప్రభుత్వమే వీటిని క్రమబద్ధీకరణ కాకుండా ఆపుతున్నారని విమర్శించారు. పేద ప్రజలకు ఓట్లతో గద్దెనెక్కిన ఈ ప్రభుత్వాలు వారి సమస్యల పరిష్కారం చేయకుండా కేవలం పేపర్, టీవీలో మాత్రం ప్రచారం గొప్పగా చేసుకుంటున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేదాకా ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నీరుని బాలరాజ్, అర్జున్, ఆశయ, బాబ్జాన్, రమణ, లక్ష్మీ, జయ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

విజయసాయి విద్యార్థుల హవా

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని గంజిరోడ్‌లో గల విజయసాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాలలో ఉత్తమ ప్రతిభను చూపారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో అభినయ 470 మార్కులకు 463, సింధు 462, భాగ్యశ్రీ 462 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో సిద్రాసోఫియా 440 మార్కులకు 432, మానియా 427, ఆతిఫా సాదాబ్ 426, గయక్వాడ్ మహేందర్ 431 మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎంపీసీలో మాన్యా 1000 మార్కులకు 989, భాను ప్రకాష్ 987, విష్ణువర్ధన్ 987, శివసాయి 986, గంగాప్రసాద్ 986, విధ్యహి 984, విశాల్ 984 మార్కులు సాధించారు. బైపీసీలో రింశా బేగం 985, ముంతాజిబ్ 984, ఫార్హాదీబా 982, హరిం ఫాతిమా 981, మేఘన 981, శివాని 980 మార్కులు సాధించారు. ఎంఈసీలో పల్లవి 956, సీఈసీలో రవీందర్ 939 మార్కులు సాధించి విజయం సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల కరస్పాండెంట్ సుబ్బారావు ప్రత్యేకంగా అభినందించారు.






ఇంటర్ ఫలితాలలో ఉషోదయ విద్యార్థుల విజయకేతనం

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని ఉషోదయ కళాశాల విద్యార్థులు మంగళవారం వెలువడిన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో విజయ భావుటా ఎగురవేశారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో కే. అంకిత 470 మార్కులకు 466 సాధించారు. అలాగే ఫర్హాన్ 464, ఎం.శిరీష 464, అర్సాఫాతిమా 464 మార్కులు సాధించారు. బైపీసీలో కురాతుల్ ఐయిన్ 440 మార్కులకు 433 సాధించారు. యషీరా అంజాద్ 431, సీఈసీలో పెహేరున్నిసా 500 మార్కులకు 486 సాధించారు. జవేరియా ఫాతిమా 474 సాధించారు. ఎంఈసీలో నష్ర నర్మీన్ 488 మార్కు లు సాధించారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవ త్సరం ఫలి తాలలో బైపీసీలో హిమవర్షిని 1000 మార్కులకు 992, రోటి హర్షిత 987 మార్కులు సాధించారు. ఎంపీసీలో షే క్ ముదాబీర్ హు స్సేన్ 9 89, వాగ్మారే కీర్తి 988, పందుల శివా 987, గాయత్రి 986, అభిరామ్ 985, ప్రజ్ఞ 985 మార్కు లు సాధించారు. అలాగే సీఈసీలో జఫిరాఖనం 978, ఎంఈసీలో హరిణి 951 మార్కులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్య ప్రకాష్‌రెడ్డి, డైరెక్టర్ దుశ్యంత్, ప్రిన్సిపాల్ ఆనంద్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.









ఇంటర్ ఫలితాలలో మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రభంజనం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ భానుమతి మంగళవారం తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో ఎం.పి.సి ద్వితీయ డి.రచన 957, బై.పి.సి నౌరిన్ 971, సి.ఈ.సి గునవతి 939, ఎం.ఈ.సి యస్.పద్మావతి 922, ప్రథమ సంవత్సరంలో 98శాతం ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. ఎం.పి.సి విశ్వజ్ఞ 444, బై.పి.సి ఎం.డి.సన 409, సి.ఈ.సి శ్వేత 425 సాధించినట్టు పేర్కొన్నారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రభంజనం..

మండలంలోని ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ మీడియట్‌లో ప్రభంజనం సాధించినట్టు ప్రిన్సిపాల్ ఎండీ అజ్మల్ ఖాన్ తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో 95శాతంతో జిల్లాలో మొదటిస్థానం సాధించినట్లు తెలిపారు. మొదటి సంవత్సరంలో 94శాతం ప్రభుత్వ కళాశాలలో అగ్రగామి అని అన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల హవా

నవతెలంగాణ-లింగంపేట్

ఇంటర్ ఫలితాల్లో లింగంపేట్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో సారిక 400 మార్కులు సాధించింది. జి.అదితి 347, బైపీసీలో మమ్మద్ ఆసిఫ్ 337, శశిత 329, సీఈసీలో రాకేష్ 331, శ్రీకాంత్ 330 మార్కులు సాధించారు. అదేవిధంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీలో అక్షిత 945 మార్కులు సాధించింది. విశ్వక్ బేగం 905, మానస 835 మార్కులు సాధించారు. బైపీసీలో విజయ్ తేజ 950, ఆఫ్రిన్ బేగం 853, లావణ్య 803 మార్కులు సాధించారు. సీఈసీ శిరీష 758, శ్యామల 754, సాయికృష్ణ 747 మార్కులు సాధించారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 170 విద్యార్థిని విద్యార్థులు పరీక్షలు రాయగా 129 మంది ఉత్తీర్ణులయ్యారు. 75.88 ఉత్తీర్ణత శాతం సాధించింది. అదేవిధంగా ఇంటర్ సెకండియర్‌లో 185 పరీక్షలకు హాజరుకాగా, 177 మంది ఉత్తీర్ణులయ్యారు. 95.4 ఉత్తీర్ణత శాతం సాధించిందని కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల బాలిక పైచేయి నిలిచిందని ఆయన అన్నారు. అదేవిధంగా బాలురు సైతం మంచి ఉత్తీర్ణత శాతం మంచి మార్కులు సాధించారన్నారు. కార్పొరేట్ కళాశాలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు విద్యార్థినీలను కళాశాల ప్రిన్సిపాల్ లెక్చరర్లు అభినందించారు. లింగంపేట్ మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం 50 మంది విద్యార్థినిలు పరీక్షలు రాయగా 43 మంది 86శాతం ఉత్తీర్ణులయ్యారు. మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ వాసంతి అభినందించారు. మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ వెంకట్ రాములు అభినందించారు.





ఇంటర్ ఫలితాలలో విద్యావికాస్ విద్యార్థుల ప్రభంజనం

నవతెలంగాణ-బోధన్

ఇంటర్ ఫలితాలలో బోధన్ పట్టణంలోని విద్యావికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఎంపీసీ విభాగంలో అరుణ్ కుమార్ 470 మార్కులకు 464, ఓంకార్ 464, మణిసాయి 464, ఎంఎస్ ధోని 463, అర్షియా తబస్సుం 463, అరుణ్ 462, కిరణ్ 461 మార్కులు సాధించారు. బైపీసీలో శ్రీణి 440 మార్కులకు 432 మార్కులు, గణేష్ 430 మార్కులు సాధించారు. సీఈసీలో అనిల్‌నాయక్ 500 మార్కులకు 411 మార్కులు సాధించారు. అలాగే ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఎంపీసీలో అక్షయ 1000 మార్కులకు 987 మార్కులు, సాహితి ప్రియా 984, అశ్విత 982, సాత్విక 981 మార్కులు సాధించారు. బైపీసీలో కనిష్క 969 మార్కులు, మోక్ష 966 మార్కులు సాధించారు. సీఈసీలో సోమనాథ్ 965, ప్రవీణ్ కుమార్ 866, సుమిత్ 891 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు కళాశాల డైరెక్టర్ అనంతలక్ష్మి అభినందించారు.









ఘనంగా మహారాణా ప్రతాప్ సింగ్ జయంతి

నవతెలంగాణ-బోధన్

యుద్ధ వీరుడుగా పేరుగాంచిన మహారాణా ప్రతాప్ సింగ్ 483వ జయంతి వేడుకలను బోధన్ పట్టణంలో సాయి ఆదర్శ మహిళ మండలి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా మండలి అధ్యక్షురాలు పద్మ సింగ్ మాట్లాడుతూ.. మహారాణా ప్రతాప్ సింగ్ మహా యోధుడని, 110 కిలోల బరువుతో ఉండే ఆయన ఒంటిపై 217 కిలోల రక్షణ కవచాలతో ఎన్నో యుద్ధాలలో విజయం సాధించిన మహా ధీరుడని కొనియాడారు. సంస్కృతి సంప్రదాయాలను విలువలిచ్చి కాపాడిన మహారాజు అని పేర్కొన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మదన్‌సింగ్, మెప్మా కోఆర్డినేటర్ శ్రీనివాస్, రాజేందర్ సింగ్, గణేష్ సింగ్, కల్పన, శకుంతల, లక్ష్మీ, రేఖ, సవిత, మహాలక్ష్మి పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న పలువురు

రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు

నవతెలంగాణ-ఎడపల్లి

ఇంటర్ వార్షిక ఫలితాల్లో ఎడపల్లి మండల పరిధిలోగల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు సాధించి కళాశాలకు, ఎడపల్లి మండలానికి మంచిపేరు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సుహాసినిరెడ్డి ఉపాధ్యాయ బృందం బాలబాలికలకు అభినందించారు. ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరంలో చదువుతున్న బాలికల్లో 36 మందికి గానూ 34 మంది బాలికలు ఉత్తీర్ణులైనారు. ఉత్తీర్ణత శాతం 94.34, గ్రేడ్ ఏలో 30 మంది గ్రేడ్ బీలో నలుగురు విద్యార్థులు మంచి మార్కులు సాధించినట్టు ఆమె పేర్కొన్నారు. మొదటి సంవత్సరం బైపీసీలో టాపర్లుగా షేక్ ముస్కాన్ 432 మార్కులు సాధించగా, అంజలి 428 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచినట్లు ఆమె తెలిపారు. ఎంపీసీ మొదటి సంవత్సరం చదివిన బాలికల్లో 34 మంది బాలికలు పరీక్షలు రాయగా 29 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో టాపర్లుగా ఐశ్వర్య 460 మార్కులు, శ్వేత 459 మార్కులు సాధించి ప్రథమ స్థాయిలో నిలిచినట్లు ఆమె పేర్కొన్నారు. రెండో సంవత్సరం బైపీసీలో 36 మంది బాలికలకు గానూ 36 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించినట్టు ఆమె వివరించారు.



ఇంటర్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండ్ ఇయర్‌లో 146 మందికి 132 మంది ఉత్తీర్ణత 90శాతం సాధించినట్లు మొదటి సంవత్సరంలో 181కి 158 మంది విద్యార్థులు ఉత్తీర్ణత (87)శాతం సాధించినట్లు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్ తెలిపారు. ఆర్.వెన్నెల 961/1000 బైపీసీలో మార్కులు సాధించినట్లు తెలిపారు. ప్రభుత్వ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాలలో 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు, షేక్ ఇలియాస్ 962/1000 బైపీసీ సెకండియర్ మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ మోబిన్ తెలిపారు.



మెరిసిన ఆణిముత్యాలు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాలలో మండల స్థాయిలో సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఫలితాలలో ఎంపీసీ విభాగంలో ఓ.సాత్విక్ 931, ఎస్.నిఖిత బైపీసీ విభాగంలో 929 మార్కులతో ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీ విభాగంలో వి.రాకేష్ 451, బైపీసీ విభాగంలో బి.గాయత్రి 420 మార్కులతో ప్రతిభను చాటారు. మొదటి సంవత్సరం 90 శాతం, ద్వితీయ సంవత్సరం 94 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ యూసుఫ్ హుస్సేన్ తెలిపారు.

ఆన్‌లైన్ వెంటనే పూర్తి చేయాలి

నవతెలంగాణ-పిట్లం

మహిళ గ్రూప్ సభ్యుల ఆన్‌లైన్ వివరాలు వెంటనే పూర్తి చేయాలని జిల్లా డీఆర్డీఏ పీడీ సాయన్న ఐకేపీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని మహిళ గ్రూపుల వివరాలను లోకోస్ యాప్‌లో ఆన్లైన్ చేయాలని, బ్యాంకు లింకేజీ వివరాలతో పాటు ఎంటర్ప్రైజెస్ వివరాలను అప్‌డేట్‌గా పొందుపరచాలని ఆయన సూచించారు. ముందుగా హస్నాపూర్ గ్రామ పంచాయతీ నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం శిరీష సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

నవతెలంగాణ-తాడ్వాయి

మాజీ మంత్రి, మాజీ మండలి ప్రతిపక్ష నేత షబ్బీర్ అలీ మానవత్వం చాటుకున్నారు. మంగళవారం కామారెడ్డి నుంచి దోమకొండకు వస్తుండగా జంగంపల్లి వద్ద ప్రధాన రోడ్డుపై ఒక వ్యక్తి పడి ఉండడం గమనించి వెంటనే కారు ఆపి దిగి ఫిడ్స్ వస్తున్న క్షతగాత్రున్ని పరిశీలించి వెంటనే తన సిబ్బంది కారులో ఎక్కించి ఆర్థిక సహాయం అందించి ఆస్పత్రికి తరలించే వరకు అక్కడే ఉన్నారు

అకాల వర్షాలకు నష్టపోయిన వరి పంట పరిశీలన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని దగ్గి శివారులోని నష్టపోయిన వరిపంటలను వ్యవసాయాధికారి ప్రజాపతి మంగళవారం పరిశీలించారు. ప్రభాకర్, సంజీవ్, గంగాధర్, విఠల్ రైతుల వరి పంటలను పరిశీలించి ప్రాథమిక అంచనా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ శిరీష రైతులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి ఇంటిపైకప్పు నేలమట్టం

నవతెలంగాణ-సిరికొండ

మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షం ,ఈదురు గాలులకు మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామ పరిధిలోని అన్నపూర్ణేశ్వరి వడ్డెర కాలానికి చెందిన పిట్ల కళ్యాణ్ కి చెందిన రేకుల ఇల్లు పై కప్పు పూర్తిగా నేల మట్టం అయిందని బాధితుడు తెలిపారు. ముఖ్యమంత్రి నిరుపేదలకు రెండు పడకల గదులు నిర్మించి ఇస్తామని చెప్పి రెండు సార్లు పదవిలోకి వచ్చిన మాలాంటి పేదలకు ఏమి న్యాయం చేశాడని, ఇండ్లు కట్టుకోవడానికి స్థలాలు ఉన్న కనీసం డబ్బులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా మాకు న్యాయం చేయాలని కోరారు.

ఓటర్ లిస్ట్ వెరిఫికేషన్ కోసం సహకరించాలి

- నిజామాబాద్ ఆర్డీవో రవి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఓటర్ లిస్ట్ ను వెరిఫికేషన్‌కోసం అందరూ సహకరించాలని ఆర్డీవో రవి కోరారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ స్థాయిలో అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, నిజామాబాద్ రెవెన్యూ డివిజన్ అధికారి రవి మంగళవారం డిచ్‌పల్లి తహసీల్దార్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో ఆర్డీవో రవి మాట్లాడుతూ.. వారికి గత వారం లో వచ్చిన ఫారం 6,7,8 లిస్టలను అందజేశారు. పలు రాజకీయ పార్టీల నాయకుల నుండి సూచనలు, సలహాలను స్వీకరించారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, పార్టీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ కథనానికి స్పందన

రోడ్డు పనులు ప్రారంభం

- హర్షం వ్యక్తం చేస్తున్న మండల వాసులు

నవతెలంగాణ-ముప్కాల్

ఈ నెల 5న ముప్కాల్ మండల కేంద్రంలో "నిలిచిన రోడ్డు వెడల్పు" పనులు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. మంగళవారం మండల కేంద్రంలో రోడ్డు పనులను ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గత కొంతకాలంగా రోడ్డు వెడల్పు పనులు 40,45 ఫీట్ల మధ్య వివాదం నెలకొంది. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కుల సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ఏకగ్రీవ తీర్మానం చేస్తూ రానున్న రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు పునరావృతం కాకుండా రోడ్డు పనులు



ముమ్మరంగా సాగేల 45 ఫీట్ల మేరకు రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు మార్గాన ఉన్న నివాస గృహ యజమానులకు, మరోవైపు వ్యాపార సంస్థల యజమానులకు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు 45 ఫీట్ల మేర రోడ్డు పనులు జరుగుతాయని అవగాహన కల్పించారు. రోడ్డు పనులు ప్రారంభించడంతో మండల వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర రోడ్లు, భవనాలు, గృహనిర్మాణ శాఖ మంత్రివర్యులు వేముల ప్రశాంత్ రెడ్డి రోడ్డు పనుల్లో అలసత్వం వహించకుండా పనులు వేణు వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

వైద్యానికి రెండు లక్షలు అందజేత

నవతెలంగాణ-మెండోర



ఎల్ఓసి అందజేస్తున్న మంత్రి

బ్రెయిన్ ట్యూమర్ వైద్యానికి రెండు లక్షల రూపాయలు అందించి బాధిత కుటుంబానికి మంత్రి ప్రశాంత్ రెడ్డి అండగా నిలిచారని మెండోర గ్రామ సర్పంచ్ మచ్చర్ల.లక్ష్మీ రాజరెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన రెంజర్ల రజిత ముత్తెన్న యాదవ్ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో నిమ్స్ హాస్పిటల్లో అడ్మిట్ అయ్యారన్నారు. ఈ సమాచారం మంత్రి ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించి ట్రీట్మెంట్ ప్రారంభించమని మీమ్స్ డైరెక్టర్ కు ఫోన్ ద్వారా ఆదేశించి రెండు లక్షల రూపాయలు ఎల్ఓసి చెక్కు రూపంలో బాధితురాలు కుటుంబీకులకు అందించారని తెలిపారు.

వికలాంగులకు బస్సు పాసులు పంపిణీ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని శుభోదయం పాఠశాలలో దివ్యాంగులకు ఎంపీపీ కుంచాల విమల రాయిత బస్సు పాసులను పంపిణీ చేశారని ఏపిఎం రవీందర్ రెడ్డి తెలిపారు. ఐకెపి ఆధ్వర్యంలో మండలంలోని దివ్యాంగులందరికీని బస్సుపాసులు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కం చంద్రకళ బాలకిషన్, ఎంపీటీసీలు రూపాల గంగారెడ్డి, మరియా సతీష్, మండల కోఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, ఎంపీడీవో లక్ష్మణ్ , మండల వికలాంగుల సమైక్య కోశాధికారి సుంకరి శ్రీనివాస్, స్వామి దాస్, ఆర్టీసీ అధికారి హనుమాన్ దాస్ మండలంలోని వికలాంగులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు చెరువులోపడి ఒకరు మృతి

నవతెలంగాణ-నందిపేట్

పొలం పనులకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి ఒకరు మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నికాల్‌పూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ రసూల్ (47) సోమవారం పొలం పనుల నిమిత్తం గ్రామ శివారు లో గల జంగం చెరువు కట్ట కింద ఉన్న తన పొలంలో వరి కోత పనికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి వెళ్లి చూసేసరికి చెరువులో పడి ఉన్నారని తెలిపారు. కాళ్లు చేతులు కడుక్కొనే సమయంలో ప్రమాదవశాత్తు చెరువులో పడి ఉంటాడని మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

మన ఊరు మనబడి పనులను పరిశీలించిన జిల్లా విద్యాశాఖ అధికారి

నవతెలంగాణ-ఆర్మూర్

మన ఊరు మన బడి " పనులను జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. మండలంలోని మన ఊరు మన బస్తీ కార్యక్రమంలో భాగంగా ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ప్రాథమిక పాఠశాల మామిడిపల్లి ప్రాథమిక పాఠశాల పెర్కిట్ పాఠశాలలను జిల్లా విద్యా శాఖ అధికారి దుర్గా ప్రసాద్ పరిశీలించారు. ఎంఓఎంబి మొబైల్ యాప్‌లో పూర్తి చేసిన పనుల ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ప్రాథానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో రాజా గంగరారామ్, నోడల్ అధికారి వెంకట నర్సయ్య, ఏఈ రఘు అనసూయ, ఉపాధ్యాయులు రవీందర్ ఎంఆర్‌సి సిబ్బంది శ్రీనివాస్, రవి పాల్గొన్నారు.

ఐదవ రోజు పంచాయతీ సిబ్బంది సమ్మె

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సమస్యల పరిష్కారం కోరుతూ నిరవధిక సమ్మె చేస్తున్న పంచాయతీ సిబ్బంది నిరవధిక సమ్మె మంగళవారంతో ఐదవ రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని 63 నంబర్ జాతీయ రహదారి పక్కన హాస కొత్తూర్ చౌరస్తా వద్ద తెలంగాణ గ్రామ పంచాయతీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసుకొని గ్రామ పంచాయతీ సిబ్బంది సమ్మెను కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కారోబార్స్ అండ్ సిబ్బంది యూనియన్ మండల అధ్యక్షులు తలారి రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం, ముఖ్యమంత్రి తక్షణమే స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు వెంకటరమణ, జిల్లా కార్యవర్గ సభ్యులు బాజే సాహెబ్, కౌడ పోచయ్య మండల సపాయిలు, ఎలక్ట్రీషన్, పంపు ఆపరేటర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి జీపీ సిబ్బంది వినతి

నవతెలంగాణ-మాక్లూర్



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పిస్తున్న జీపీ కారోబార్లు, సిబ్బంది

మండలం లోని గ్రామపంచాయతీ కారోబార్స్, సిబ్బంది యూనియన్ తమ సమస్యల పరిష్కారానికి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతి కారోబార్లు, వాటర్ మ్యాన్ లు, డ్రైవర్, ఎలక్ట్రిషన్లు, స్వీపర్లు మండల కార్యాలయం నుంచి మాక్లూర్ గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి వినతి అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆర్. బాలకిషన్, జిల్లా అధ్యక్షులు, సుధకర్, కార్యదర్శి నర్సారెడ్డి, క్యాషన్ బలరాజ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

- తెలంగాణ రైతు సంఘం

నవతెలంగాణ-నవీపేట్

మండలంలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని తడగాం, కమలాపూర్, మోకన్ పల్లి, మహంతం, అభంగపట్నం గ్రామాలలో వరి ధాన్యాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ నాయకులు దేవేందర్ సింగ్ మాట్లాడుతూ ఇప్పటివరకు కేవలం 30 శాతం మాత్రమే వరి ధాన్యం కొనుగోలు జరిగాయని ఇంకా 70శాతం వరి ధాన్యం రోడ్లపైనే ఉందని అన్నారు.



ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

రైస్ మిల్లర్లు మ్యాచర్, తరుగు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని కలెక్టర్ స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ధాన్యం కొనుగోలు నామమాత్రంగా జరగడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిషన్, గంగాధర్, రమేష్, మరియు రైతులు తదితరులు ఉన్నారు.

నెలాఖరులో గొర్రెల పంపిణీ చేపడతాం

- జిల్లా పశు వైద్యశాఖ అధికారి జగన్నాథ చారి

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో మండల పశు వైద్యాశాఖ, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రెండవ విడత గొర్రెల పంపిణీపై అవగాహన కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా పశు వైద్యశాఖ అధికారి జగన్నాథ చారి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం రెండవ విడుత గొర్రెలను ఆంధ్రప్రదేశ్ లోని అనంతపూర్, కర్ణాటకలోని రాయపుర్ ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి లబ్దిదారులకు అందించనున్నారని తెలిపారు. రెండో విడత యూనిట్ విలువ రూ 1.75 లక్షలు కాగా లబ్దిదారుని వాటా రూ. 43.750 నిర్ణయించారని, ఇందుకోసం ఈనెల చివరి వారం వరకు గొర్రెలను పంపిణీ చేపడుతామని చెప్పారు. లబ్దిదారులు తొందరగా వారి వాటా వారికిచ్చిన ఐడి ప్రకారం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ముద్దల మల్లుబాయి, మండల గొర్రెల పెంపకం దారుల సంఘం అధ్యక్షులు బూరొల్ల అశోక్, గ్రామ గొర్రెల సంఘం అధ్యక్షులు మల్లయ్య, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సత్యనారాయణ, వైద్యాధికారులు కిరణ్ దేశ్ పాండే,



మాట్లాడుతున్న జగన్నాథ చారి

ఉమామా శహెన్, సిబ్బంది, ఒడ్యాట్ పల్లి గొల్ల కుర్మ అధ్యక్షులు జనార్ధన్ గొల్ల, కురుమ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగుల విజ్ఞాన సేవా సమితి జిల్లా అధ్యక్షులుగా గోపు శ్రీకాంత్ యాదవ్

నవతెలంగాణ-ముప్కాల్




నియామక పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

దివ్యాంగుల విజ్ఞాన సేవా సమితి జిల్లా అధ్యక్షులుగా గోపు శ్రీకాంత్ యాదవ్ ను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు సట్టి సాయన్న తెలిపారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాన్ని శ్రీకాంత్ యాదవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గాన్ని సైతం ఎన్నుకున్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఇప్ప రాధ (సావెల్), గౌరవ అధ్యక్షులుగా కర్జాల శంకర్ దాస్ (ముప్కాల్)లను తోటి దివ్యాంగుల నడుమ ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. దివ్యాంగుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని నూతన అధ్యక్షులు గోపు శ్రీకాంత్ యాదవ్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల దివ్యాంగుల విజ్ఞాన సేవా సమితి సభ్యులు కుమ్మరి సుఖదాస్, కుంట గంగారెడ్డి, శ్రీరాంసాగర్, సాయన్న, రాజన్న, కట్ట రాజేశ్వర్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వార్డు పదవికి రాజీనామా

నవతెలంగాణ-నందిపేట్



రాజీనామాపత్రాన్నిఅందజేస్తున్న వార్డుసభ్యురాలు

ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతో ఓ వార్డు సభ్యురాలు తన పదవికి రాజీనామా చేసింది. మండలంలోని తల్వేద గ్రామానికి చెందిన 8వ వార్డు సభ్యురాలు ఇర్నపల్లి లత నరేష్ గౌడ్ మంగళవారం వార్డు సభ్యురాలి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎంపిఓ కిరణ్ కుమార్ కు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... సర్పంచ్ ,ఉపసర్పంచ్ ఇద్దరు ఒకరే కావడంతో భార్యాభర్తలు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా పరిపాలన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వ సొమ్ముకు గండి కొడుతూ అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం పదే పదే చెప్పున్న 58,59 జి ఓ తుంగలో తొక్కి, ఇండ్ల క్రమబద్దీకరణ అక్రమ లేఅవుట్ విషయంలో గతంలో సర్పంచ్ చందన కు పంచాయతీ సెక్రటరీలకు పలుమార్లు నోటీసులు వచ్చాయన్నారు. వీటన్నింటి కారణంగా వార్డు సభ్యురాలి పదవికి రాజీనామా చేస్తున్నానని ఆమె ప్రకటించారు.

చెట్టుపై పడిన పిడుగు

- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- ఊపిరి పీల్చుకున్న గ్రామస్తులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలోని నడుల్ల సాయిలు పశువుల కొట్టం వద్ద మంగళవారం పిడుగు పడిందని దాన్ని చుట్టుపక్కల నివాస గృహాలు ఉండడంతో ఎలాంటి ప్రాణ ఆస్తి నష్టం జరగకపోవడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం తప్పినట్లు అయింది. చెట్టుపై పిడుగు పడడంతో చెట్టు కొమ్మలు కాలి కింద పడినట్లు గ్రామస్తులు తెలిపారు. గత కొన్ని రోజులుగా వర్షాలతో అతలాకుతలమైన రైతులు రెండు మూడు రోజుల నుండి ఎండలు ఉండడంతో హాయిగా ఊపిరి పీల్చుకున్న తరుణంలోనే మళ్లీ వర్ష సూచన రైతులకు కన్నీటి పర్యంతమవుతున్నాయి.

ట్రాఫిక్‌పై వాహనదారులకు అవగాహన

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని నిఖిల్ సాయి చౌరస్తా, పులాంగ్ చౌరస్తా, ఆర్ఆర్ చౌరస్తాలో ట్రాఫిక్ సిఐ చందర్ రాథోడ్, ట్రాఫిక్ ఎస్ఐ మోహన్‌రావు, ట్రాఫిక్ సిబ్బంది, పోలీస్ కళాబృందం పాషా టీంతో మంగళవారం వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని సూచించారు. త్రిబుల్ రైడింగ్ చేయకూడదని ఒకవేళ త్రిబుల్ రైడింగ్ చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిపారు. సిగ్నల్ జంప్ చేయవద్దని రెడ్ సిగ్నల్ పడ్డప్పుడు ఆగి ఉండాలని గ్రీన్ సిగ్నల్ పడ్డప్పుడు వెళ్లాలని సూచించారు. రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్ చేయరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించని వారిపై చట్టప్రకారంగా జరిమానాలను విధిస్తూ కేసులను కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు. సుమారు మూడు ప్రాంతాల్లో 250 మంది వాహనదారులకు అవగాహన కల్పించారు.

కార్యాలయం ఖాళీ చేయండి.. తాళం వేస్తాం

- 14నెలలుగా అద్దె చెల్లించని తహసీల్దార్ కార్యాలయం
- 4ఏళ్ళుగా అద్దె చెల్లించని ఎంపీడీవో కార్యాలయం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత 14 నెలల నుండి అద్దెకుంటున్న తహసీల్దార్ కార్యాలయంలో అద్దె చెల్లించకపోవడంతో గృహ యజమానులు గత కొన్ని రోజులుగా కార్యాలయాన్ని ఖాళీ చేయాలని విన్నవించుకున్నారు. ఇందల్‌వాయి మండలకేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన అబ్దుల్ అజీజ్ ఆరుగురు అన్నదమ్ములు కలిసి నివాస గృహం ఏర్పాటు చేసుకున్నారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతనంగా మండలాలను ఏర్పాటు చేశారు. గత ఆరేళ్ల క్రితం తహసీల్దార్ కార్యాలయానికి నెలకు పదివేల చొప్పున అద్దెకిచ్చారు ఆనాటి నుండి నేటి వరకు ప్రతి నెల పదివేల రూపాయలు చెల్లించాల్సి ఉండగా గతం నుండి నాలుగు, ఐదు, ఆరు నెలలకు ఒకసారి అద్దెలు చెల్లిస్తుండేవారని, కాని గత 14నెలలనుండి అద్దె చెల్లించక పోవడంతో విసుగు చెందిన యజమాని పలుమార్లు తహసీల్దార్ కార్యాలయంకు వచ్చి అద్దె చెల్లించాలని అధికారులవద్ద మొర పెట్టుకుంటూనేఉన్నారు. లేకుంటే కార్యాలయం ఖాళీ చేయాలని పేర్కొన్నారు. కానీ తాము ఏమి చేయలేమని, తమ వద్ద చెల్లించే డబ్బులు లేవని అధికారులు పేర్కొన్నట్లు గృహ యజమాని అజీజ్ నవ తెలంగాణకు వివరించాడు. దానిలో భాగంగానే సోమవారం అజీజ్ అన్నదమ్ములందరూ కలిసి ప్రజావాణిలో జిల్లా పాలనాధికారి రాజీవ్ గాంధీ హనుమంతును కలిసి సమస్యలతో కుడిన వినతి పత్రాన్ని అందజేశారు. వెంటనే స్పందించిన జిల్లా పాలన అధికారి ఇందల్ వాయి తహసిల్దార్ కు ఫోన్లో మాట్లాడి రెండు మూడు రోజుల్లోనే ఎలాగైనా వారికి అద్దె చెల్లించాలని ఆదేశించినట్లు గృహ యజమాని తెలిపారు. తమ ఆరుగురం అన్నదమ్ములమని తమ ఉండకుండా కార్యాలయం కోసం తాము దానిలో ఉండకుండా ఇచ్చామని, తమకు ప్రతినెల డబ్బులు అత్యంత అవసరమని నెలవారీగా డబ్బులు అందజేసే విధంగా అదికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వారు వేడుకున్నారు. గత ఆరేళ్ల నుండి పదివేల రూపాయలకే అద్దె చెల్లిస్తున్నారని, అనాడు తిర్మన్‌పల్లి గ్రామస్తుల కోరిక మేరకు తమ నివాస గృహాన్ని కార్యాలయం కోసం అందజేశామని, వారిచ్చే పదివేలు అది ఏ మూలన సరిపోవటం లేదని వారన్నారు.




తహసీల్దార్ కార్యాలయం

ప్రతి ఏడాది ఐదు నుంచి పది శాతం మేర అద్దె పెరగవలసి ఉన్న ఒక్క శాతం కూడా పెంచకుండానే అందజేయడం సబబు కాదని వారన్నారు. ఇకనైనా జిల్లా పాలన అధికారి ఆదేశాల మేరకు తమకు 14 నెలల అద్దె చెల్లించాలని వారు విన్నవించు కుంటున్నారు. ఇకనుంచి ప్రతి నెల తమ ఖాతాల్లో డబ్బు జమ చేసే విధంగా కృషి చేయాలని వారు కోరుతున్నారు.

అద్దె ఎరుగని ఎంపిడివో కార్యాలయం

గత నాలుగేళ్లుగా మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం సైతం అద్దె భవనంలోనే కొనసాగుతూ ఉంది. ఆనాటి నుండి నేటి వరకు గృహ యజమానికి రూపాయి చెల్లించిన దాఖలాలు లేవు.

మండలానికి పట్టుకొమ్మలుగా ఉన్న తహసీల్దార్, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయలు అద్దెలు చెల్లించడమే మరిచిపోయారు. మండలానికి చెందిన ఒక ప్రజా ప్రతినిధి బంధువుకు సంబంధించిన ఈ గృహం ఉండడంతో అధికారులకు వచ్చి అద్దె చెల్లించాలని అడగడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం సొంత భవనాలు నిర్మించి ఉంటే ఇంత ఇబ్బందులు ఉండేవి కాదని మండల వాసులు పేర్కొంటున్నారు. పోలీస్ స్టేషన్ మిషన్ భగీరథకు సంబంధించిన వాచ్మెన్ గృహంలో ఉండగా ఐకెపి కార్యాలయం అదే భవనంలోనే కొనసాగుతూ ఉంది. గతంలో వ్యవసాయ శాఖ కార్యాలయం అద్దెకు తీసుకున్న అద్దె చెల్లించక ఇబ్బందులు పడడం ఎందుకని గతేడాది ఇందల్వాయి గ్రామంలో నిర్మించిన రైతు వేదికనే కార్యాలయం చేసుకుని పని కానిస్తున్నారు. ప్రభుత్వం నూతన మండలాలకు అత్యంత అవసరమయ్యే కార్యాలయాల నిర్మాణాల కోసం నిధులను కేటాయించి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని మండల ప్రజలు ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. మండలపరిషత్ కార్యాలయంలో తగినంత స్థలం లేకపోవడంతో



ఎంపీడీవో కార్యాలయం

సర్వసభ్య సమావేశాలు ఖాళీస్థలంలో టెంట్‌వేసుకొని బయట నిర్వహించుకునే పరిస్థితులు దాపురించింది.

సర్వసభ్య సమావేశాల సమయంలో ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలని పలుమార్లు తీర్మానాలు సైతం చేసినట్లు ప్రజా ప్రతినిధులు వివరించారు.

ఇదే కాకుండా పంచాయతీ కార్యదర్శులు ఉపాధి హామీ సిబ్బందితో సమావేశాలు నిర్వహించాలన్న చెట్లకిందే సమావేశాలు పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్నారు ఇకనైనా అధికారులు ప్రజాప్రతినిధులు పాలకులు స్పందించి కలయాలకు నూతన భవనాల నిర్మాణానికి కృషిచేసి మండలాన్ని అద్దె కార్యాలయం లేకుండా చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని పలువురు పేర్కొంటున్నారు.

ఇదే విషయమై తహసీల్దార్ టీవీ రోజను సంప్రదించగా జిల్లా పాలనధికారి ఆదేశాల మేరకు తమ వద్ద ఉన్న డబ్బులకు అనుమతుల కోసం ఉన్నతాధికారులకు నివేదించామని వారికి పంపిన నివేదిక వచ్చిన వెంటనే డబ్బులను గృహ యజమానికి అందజేయడం జరుగుతుందని గృహ యజమాని కూడా ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు.

4 ఏళ్ళ నుండి డబ్బులు చెల్లించలేదు ఎంపిడివో రాములు నాయక్..

మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయనికి సంబంధించిన అద్దెను కార్యాలయం మొదలు పెట్టినప్పటినుండి ఇప్పటివరకు అందజేయలేదు. నాలుగేళ్ల అద్దె చెల్లించవలసి ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిధులు వస్తే డబ్బులు చెల్లిస్తాం. మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాములు నాయక్ 'నవ తెలంగాణ' కు వివరించారు. సమావేశాలకు నిర్వహించినప్పుడు ఇబ్బందులు జరుగుతున్న మాట వాస్తవమేనని కానీ చేసేదేమి లేక వారితో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పంటలను కాపాడుకోవాలి

నవతెలంగాణ-ఏర్గట్ల

తుపాన్ ప్రభావంవల్ల ఈదురుగాలులతో చెదురుమదురుగా అక్కడక్కడ వర్షాలు కురుసే అవకాశం ఉన్నందున మండలానికి చెందిన రైతులు వారి పంటలను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం వల్ల వరి తడిసి పాడై పోతుందని, వరి కోతలు కోయని రైతులు కోతలు వాయిదా వేయాలని పేర్కొన్నారు. ఒక వేళ పంటను కోసినట్లయితే టార్పాలిన్‌లతో వరి తడిసిపోకుండా కప్పి ఉంచాలని కోరారు.

బీజేపీ పతనం ప్రారంభమైంది

• మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ - వేల్పూర్

యువతలో మార్పు మొదలైంది..బీజేపీ పతనం ప్రారంభమైందని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. బిజెపి వల్ల దేశంలో వైషమ్యాలు తప్పా...అభివృద్ధి లేదని మెల్లమెల్లగా యువత గ్రహిస్తున్నదని చెప్పారు. కేసీఆర్ అభివృద్ధి కోసం పని చేస్తుంటే...బీజేపీ విద్వేష, కక్ష్యపూరిత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. మండలంలోని కుకునూర్ గ్రామానికి చెందిన బీజేపీ, బీఎస్పీ పార్టీకి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా వచ్చి మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి మంత్రి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ లేవని, కేసీఆర్ ప్రధాని అయితే దేశవ్యాప్తంగా రైతు బంధు, రైతు భీమా, దళిత బంధు ఇస్తారని, దేశం అంతటా అభివృద్ధి జరుగుతుంది కేసిఆర్ కి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ప్రజలు మద్దతుగా వస్తున్నారని యువకులు అన్నారు. బీజేపీవల్ల దేశానికి నష్టం జరుగుతుందని, వారు చెప్పేది ఒకటి చేసేది ఒకటి, అసత్యాలు ప్రచారం చేయిస్తున్నారని యువకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఇవన్నీ గమనించే అభివృద్ధి చేసే బిఆర్ఎస్ వైపే ఉందామని స్వచ్ఛందంగా పార్టీలో జాయిన్ అవుతున్నామని పేర్కొన్నారు. బీజేపీ నిజస్వరూపం తెలుసుకొని కుకునూర్ గ్రామ యువకులు చూపిన ఈ చైతన్యం యువతలో రాబోతున్న మార్పుకు నాంది అని పేర్కొన్నారు .నీచ,అవినీతి రాజకీయాలకు..అభివృద్ధి కి మధ్య జరిగే పోరాటంలో యువత అభివృద్ధి వైపే ఉంటామని,స్వచ్ఛందంగా బిఆర్ఎస్ లో చేరాలనే యువత నిర్ణయం గొప్ప శుభపరిణామమని మంత్రి వేముల పేర్కొన్నారు. బాల్కొండ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో,ఆపదలో అండగా ఉంటానని మరోమారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి,డాక్టర్ మధుశేఖర్, సురేష్ వైస్ ఎంపిపి,సర్పంచ్ లింబాద్రి,రాజశేఖర్ గౌడ్ ఎక్స్ సర్పంచ్, సొసైటీ డైరెక్టర్ అశోక్,ఎస్.సి మండల ప్రెసిడెంట్ తలారి ప్రభాకర్,మోర్తాడ్ నర్సయ్య, యువ నాయకులు నిమిష్, తదితరులు పాల్గొన్నారు..



బీఆర్ఎస్ చేరిన యువకులకు పార్టీ కండువాలు వేస్తున్న మంత్రి

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

• మాజీ ఎమ్మెల్సీ వి.గంగాధర్ గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ముందస్తుగా ఆసుపత్రి ఖర్చులకోసం, ఆపరేషన్ తర్వాత ఆర్థిక సహాయంగా ముఖ్యమంత్రి కెసిఆర్, ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ సహకారంతో ముఖ్య మంత్రి సహాయనిధి నుండి మంజూ రైన 60వేల రూపా యల చెక్కును మంగ ళవారం మాజీ ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి గంగాధర్ గౌడ్ లబ్ధిదారులకు అందజేశారు. ఇందల్ వాయి మం డల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామానికి చెందిన డిపు శ్రవంతికి రూ. 60వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తిర్మన్ పల్లి గ్రామ శాఖ అధ్యక్షులు ప్రవీణ్ గౌడ్ లబ్ధిదారులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న వి. గంగాధర్‌గౌడ్

ఆటల పోటీల కోసం జట్ల పేర్లు నమోదు చేసుకోవాలి

ఎంపిడివో సంతోష్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ముఖ్యమంత్రి కప్ ఆటల పోటీల కోసం ఆయా గ్రామాల నుండి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో పాల్గొనే జట్ల పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో సంతోష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపిపి చాంబర్‌లో ముఖ్యమంత్రి కప్ ఆటల పోటీల నిర్వాహణపై ఎంపిపి అధ్యక్షురాలు లోలపు గౌతమి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల కన్వీనర్ ఎంపిడివో సంతోష్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కప్ ఆటలపోటీల్లో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుండి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో 16సంవత్సరాల నుండి 36లోపు యువతి యువకులు పాల్గొనాలని అన్నారు. ప్రతి గ్రామంనుండి అన్నివిభాగాల్లో ఒక్కో జట్టు పాల్గొనాలన్నారు. పోటీలు ఈ నెల 15,16,17 తేదీల్లో కమ్మర్‌పల్లి మినీ స్టేడియంలో జరుగుతాయని తెలిపారు. పాల్గొనే జట్లు, వారి పేర్లతో సహ 11 నుండి 13వరకు 4గంటల లోపు ఎంపిడివో కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, కమ్మర్‌పల్లి ఎస్ఐ రాజశేఖర్, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్ గౌడ్, ఫిజికల్ డైరెక్టర్ ఎం.రాజేందర్, పిఇటి గంగాధర్, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ

బీఆర్ఎస్ నాయకులు పెయిడ్ ఆర్టిస్టుల్లా మాట్లాడడం సిగ్గుచేటు

బీజేపీ నాయకులు

నవతెలంగాణ -నవీపేట్

ధాన్యం కొనుగోలు విషయంలో బీఆర్ఎస్ నాయకులు పెయిడ్ ఆర్టిస్టుల్లాగా అవగాహన లేకుండా మాట్లాడడం సిగ్గుచేటని బిజెపి నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాలులో బిజెపి నాయకులు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు పుట్ట శ్రీనివాస్ గౌడ్, లక్ష్మణ్, రాజేందర్ గౌడ్, బాదావత్ గణేష్ మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు రైతులు అకాల వర్షాలతో ఇబ్బందులు పడి ధాన్యం తడిసిపోతే రైతులకు భరోసా ఇవ్వాల్సింది పోయి ప్రతిపక్ష నాయకులపై విలేకరుల సమావేశం నిర్వహించి విమర్శించడం సిగ్గుచేటని అన్నారు. తమ ఎమ్మెల్యే మండలంలో ఏ ఒక్క రైతు కైనా కలిసిన దాఖలాలు ఉన్నాయా అని ప్రశ్నించారు. తడిసిన ధాన్యం కొంటామని ప్రకటన చేయడమే తప్ప రైస్ మిల్లులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వలేదని అన్నారు. వడ్డీ మోహన్ రెడ్డి రైతుల పక్షాన రైస్ మిల్లర్స్‌తో మాట్లాడి రైతులకు నష్టం కలగకుండా చూసేందుకు బీఆర్ఎస్ మంత్రులైన గంగుల కమలాకర్, సివిల్ సప్లై అధికారులను సైతం కలిసిన విషయాన్ని గుర్తు చేశారు. మోహన్ రెడ్డి ప్రజలు, రైతులతో మమేకమై పనిచేస్తుండడంతో ఓర్వలేకనే ఉద్దేశపూర్వకంగా అవాకులు చెవాకులు పేలుతున్నారని అన్నారు.

అధికార పార్టీ నాయకులై ఉండి సొంత ధాన్యాన్నిరైస్ మిల్లులలో దించుకోలేని అసమర్థులని కేవలం ప్రెస్ మీట్ లకు పనిచేసే నాయకులని విమర్శించారు. నష్టపోయిన నివేదికను కేంద్రానికి పంపిస్తేనే కేంద్రం ద్వారా నష్టపరిహారాన్ని పొందవచ్చని రాజకీయాలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు గంగోని రాము, బాల గంగాధర్, నాయకులు భూషణ్, మల్లెపూల గంగాధర్, మహేష్, ఆకాష్, బండారి శేఖర్, సాయన్న, సాయిరెడ్డి, బాబుగౌడ్, అంకిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

కమ్యూనిస్ట్ ప్రణాళిక ప్రపంచ విప్లవ పార్టీలకు కరదీపిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

175 సంవత్సరాల క్రితం కారల్ మర్క్స్ రాసిన కమ్యూనిస్ట్ ప్రణాళిక విప్లవ పార్టీకి నేటికీ కరదీపికగా మరింత ప్రాధాన్యత సంతరించుకుందని,, ఒక సర్వేలో 28 దేశాల్లో యువత ఇష్టంగా చదువుతూ ఆచరించే ప్రయత్నాలు చేస్తున్నారని, అంతేకాక ప్రపంచంలో 128 భాషల్లో ఈ గ్రంథం ముద్రించబడిందని సిపిఐ(ఎం ఎల్ ప్రజా పందా) రాష్ట్ర నాయకులు వి. ప్రభాకర్ అన్నారు. నిజామాబాదులో గల సిపిఐ ఎంఎల్ ప్రజాపంతా జిల్లా కార్యాలయం ఎన్ ఆర్ భవన్ కోట గల్లి లో ఏర్పాటుచేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ.... ప్రపంచంలో ఏ మత గ్రంథం కూడా ఇన్ని కాపీలు ప్రింట్ కాలేదని,, ఎక్కువ భాషల్లో ప్రింటి కాలేదని అన్నారు. కారల్ మర్క్స్ మే 5 న జయంతి సందర్భంగా దేశంలో 4 కమ్యూనిస్ట్ పార్టీలు పశ్చిమ బెంగాల్ రాష్టం కలకత్తా మహా నగరం లోని రామ్మోన్ రాయ్ హల్ లో నిర్వహించిన సెమినార్ లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, పంజాబ్, బెంగాల్ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సెమినార్‌లో పాల్గొని వచ్చిన సందర్భంగా అయన మాట్లాడారు. భారతదేశ భౌతిక పరిస్థితి ని అధ్యాయ నం చేసి మాస్ లైన్ తో నూతన ప్రజా తంత్ర విప్లవం విజయ వంతం కోసం దేశం లో ఈ 4 పార్టీల కు "సెమినార్ "స్ఫూర్తి కలిగించే మైలు రాయిగా నిలుస్తుందని అన్నారు. సమావేశంలో కలకత్తా సెమినార్ లో పాల్గొన్న ప్రజా పందా జిల్లా నాయకులు బి దేవారం, పి రామకృష్ణ, ఎం ముత్తన్న, మల్లేష్, గుమ్ముల గంగాధర్, బి బాబన్న, బి కిషన్, బి అశోక్, పుట్టి నడిపి నాగన్న, ఏం లింబాద్రి, అనీష్, అఫ్రోజ్, తదితరులు పాల్గొన్నారు..

దళితబంధులో లంచం తీసుకున్న ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-సిరికొండ

దళిత బంధు లబ్ధిదారుల నుంచి లంచం తీసుకున్న ఎమ్మెల్యేలపై, వారి అనుచరులపై చట్టపరమైన చర్యలు తీసుకొని ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ... కేసీఆర్ మాట్లాడుతూ దళిత బంధు లబ్ధిదారుల వద్ద లంచం తీసుకున్న ఎమ్మెల్యేల చిట్టా తన దగ్గర ఉందని తానే స్వయంగా ఒప్పుకున్నారని తెలిపారు. కాబట్టి ముఖ్యమంత్రి వద్ద ఉన్న చిట్టా బయట పెట్టాలని, ఆ ఎమ్మెల్యేలను పదవి నుంచి తొలగించి, వారిపై ఎస్సి, స్టేటస్ సిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని జిల్లా బిజెపి ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బిఆర్ శివప్రసాద్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్, మండల అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు సాంద్ర శంకర్, రామస్వామి, లింబన్న, గోవింద్, కళ్యాణ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

వంట వార్పుతో నిరసన

16వరోజు వీవోఏల సమ్మె

నవతెలంగాణ-భీంగల్/కమ్మర్‌పల్లి

తమను సెర్ప్ ఉద్యోగులగా ప్రకటించాలని చేపట్టిన వివోఏల సమ్మెలోభాగంగా ఐకెపి కార్యాలయం ముందు వంటవార్పుతో నిరసనతెలిపారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈసమ్మెలో రత్నాకర్‌గౌడ్, చింటు, వివోఏలు పాల్గొన్నారు.

వీవోఏల సమ్మెకు మహిళా సంఘాల సభ్యుల సంఘీభావం

కమ్మర్‌పల్లి : తమ డిమాండ్ల పరిష్కారంకోసం మండల కేంద్రంలో 16 రోజులుగా సమ్మె చేస్తున్న వీవోఏలు సమ్మె శిబిరం వద్ద వంటావార్పుతో నిరసన తెలిపారు. వీరి సమ్మెకు మండలంలోని ఆయాగ్రామాల మహిళా సంఘాల అధ్యక్షులు వచ్చి సమ్మె శిబిరంలో కూర్చుని తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వివోఏల సంఘం మండల అధ్యక్షుడు సుభాష్ మాట్లాడుతూ వివోఏలను సెర్ప్ సిబ్బందిగా గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఐకేపీ వివోఏలకు నెలకు కనీసం వేతనం రూ.18వేలు చెల్లిస్తూ, నేరుగా డీఆర్‌డీఏ ఖాతా నుండి వీవోఏల ఖాతాలో జమచేయాలనీ డిమాండ్ చేశారు. రూ. 10 లక్షల సాదారణ బీమా వర్తింపజేసి ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధికరించాలన్నారు. సెర్ప్ సిబ్బందిగా గుర్తిస్తూ ఐడి కార్డులు అందజేయాలన్నారు.

